

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి సోమవారం 24-08-2026 సంపుటి: 02 సంచిక : 114 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy monaday 24-08-2026 Volume :02 Issue: 114 RS: 4 Pages:08 Editor : Katta HimaPavani





Contact Number
9059328777




## పార్లమెంట్ మళ్లీ సమావేశమయ్యేనా!

- ఆగస్టు 13న నిరవధికంగా ని వాయిదా పడిన ఉభయ సభలు
- వర్షాకాల సమావేశాల ముగింపుపై నోటిఫికేషన్ రాలేదు
- మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్రం కసరత్తు
- 2029 ఎన్నికల నాటికి రిజర్వేషన్లు అమలు చేసే యోచన
- డీలిమిటేషన్‌తో ముడిపడి ఉన్న బిల్లుపై ఆసక్తి
- కేంద్ర తీరుపై కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ ప్రశ్నలు

న్యూఢిల్లీ,
పార్లమెంట్ ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడి 10 రోజులైనా అధికారికంగా వర్షాకాల సమావేశాలు ఇంకా ముగియలేదు. దీంతో కొత్త సమావేశాన్ని ఏర్పాటు చేయకుండానే ఒక కీలకమైన చట్టాన్ని ఆమోదించాలని కేంద్రం యోచిస్తున్నదని, పార్లమెంట్‌ను తిరిగి సమావేశపరుస్తుందన్న ఊహాగానాలు వెలువడుతున్నాయి. లోక్‌సభ, రాజ్యసభలు ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడ్డాయి. అలా జరిగిన తర్వాత సాధారణంగా

-మిగతా 2 లో

### కాంగ్రెస్ దగా పాలనపై బీఆర్ఎస్

# సమరభేరి

### సెప్టెంబర్ 2 నుంచి రాష్ట్రవ్యాప్త నిరసనలు

- ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం
- బాకీ కార్డులతో హామీల వైఫల్యాలను ఎండగట్టాలి
- ప్రజా సమస్యలపై విస్తృతంగా పోరాటం చేయాలి
- పార్టీ శ్రేణులంతా ఏకతాటిపైకి రావాలి
- వినూత్న రీతిలో నిరసనలు చేపట్టాలి
- కాంగ్రెస్ అవినీతి, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ప్రతి వర్గానికి హామీల బకాయిల వివరాలు వివరించాలి
- ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొనాలి
- పార్టీ నాయకులకు కేటీఆర్ దిశానిర్దేశం




హైదరాబాద్
వంద రోజుల్లోనే ఆరుగ్యారంటీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులైనా అమలు చేయకుండా ప్రజలను దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై బీఆర్ఎస్ సమరభేరి మోగించనుంది. కాంగ్రెస్ మోసాన్ని ప్రజల్లో ఎండగట్టేందుకు కార్యాచరణను సిద్ధం చేసింది. వచ్చేనెల రెండు నుంచి వారంరోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్

-మిగతా 2 లో



### బంగాళాఖాతంలో

## అల్పపీడనం

- తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం
- పలు జిల్లాల్లో దంచి కొట్టనున్న వర్షాలు
- అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచన

హైదరాబాద్:
ఆగస్టు నెల ప్రారంభమైనప్పటి నుంచి వాతావరణ శాఖ తొలిసారి తెలంగాణకు భారీ హెచ్చరికలు జారీ చేసింది. ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా మళ్లీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆగస్టు మాసంలో సాధారణం కంటే తక్కువగా వర్షపాతం నమోదైంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో కేవలం 6 సెంటీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. దీనివల్ల 18 శాతం వర్షపాత లోటు ఏర్పడగా, తాజాగా పడుతున్న వర్షాలతో ఉపశమనం లభించనుంది. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు.

-మిగతా 2 లో

## సీజేపీ మరో ఉద్యమం?

- హామీల అమలులో జాప్యం.. కేంద్రంపై ఆగ్రహం
- దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమాలకు యోచన
- నేడు సీజేపీ జాతీయ వర్కింగ్ కమిటీ భేటీ
- తదుపరి కార్యాచరణపై కీలక సమీక్ష

02

కేంద్రం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ మరోసారి దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతోంది. విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ, శాంతియుత నిరసనకారులపై చర్యలు తీసుకోకపోవడం, నీట్ పరీక్ష నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయిన అభ్యర్థుల కుటుంబాలకు ఆర్థిక సాయం వంటి హామీల అమలులో జాప్యంపై పార్టీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకునేందుకు నేడు జరిగే జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశంపై ఉత్కంఠ నెలకొంది.

COCKROACH
JANTA PARTY



### మరింత బలపడుతున్న

## ఎల్ నినో..

- వాతావరణ విభాగం వెల్లడి
- బలహీనపడుతున్న రుతుపవన ద్రోణి
- సెప్టెంబర్‌లో మరింత పెరుగనున్న వర్షపాతం లోటు

హైదరాబాద్,
పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్ నినో ప్రభావం క్రమంగా బలపడుతున్నది. దీంతో భారత్‌లో నైరుతి రుతుపవనాలు బలహీనపడటం ప్రారంభమైంది. బంగాళాఖాతంలో అప్పుడప్పుడూ అల్పపీడనాలు ఏర్పడుతున్నా.. అవి బలపడుతున్న సూచనలు కనిపించడం లేదు. దీంతో అల్పపీడన వర్షాలు కూడా తగినంతగా కురువడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో భారత వాతావరణ విభాగం మరో కీలక ప్రకటన చేసింది. సాధారణంగా అయితే దేశంలో రుతుపవనాలు ప్రస్తుతం చాలా చురుగ్గా ఉండాలి. కానీ పరిస్థితి రివర్స్ అయ్యి బలహీన పడుతున్నట్టు అధికారులు తెలిపారుకనీసం రాబోయే రెండు వారాలపాటు అంటే సెప్టెంబర్ 2 వరకు దేశవ్యాప్తంగా

-మిగతా 2 లో

### పెట్టుబడులు, విద్యపై

# ప్రత్యేక దృష్టి

### తెలంగాణ రైజింగ్‌కు ప్రవాసులు భాగస్వాములు కావాలి

- విద్యా రంగం బలోపేతం, తెలంగాణ అభివృద్ధిపై చర్చలు
- ఎన్నారైలు, పెట్టుబడిదారులు, విద్యావేత్తలు, నిపుణులతో సీఎం ముఖాముఖి
- ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ పీసీసీ ఎన్నారై కన్వీనర్ సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం
- తెలంగాణ అభివృద్ధికి ప్రవాసులు బలమైన మద్దతుదారులు, రాయబారులుగా ఉండాలని సీఎం పిలుపు

హైదరాబాద్:
తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి లండన్ పర్యటనలో భాగంగా ప్రవాస భారతీయులు, ఇండియన్, తెలుగు కమ్యూనిటీ ప్రతినిధులతో ప్రత్యేక 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సెంట్రల్ లండన్‌లోని ప్రముఖ తాజ్ హోటల్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ పీసీసీ ఎన్నారై కన్వీనర్, ఇండియన్ కమ్యూనిటీ నాయకుడు సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెట్టుబడిదారులు, విద్యావేత్తలు, ఎన్నారైలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

-మిగతా 2 లో






### కొండాపై

## గరం గరం

- సురేఖ వ్యవహారంలో కలిసేందుకు ఇష్టపడని ముఖ్యనేతలు
- సొంత పార్టీ నుంచే భగ్గుమంటున్న కాంగ్రెస్ నేతలు
- కనీస అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వని సీనియర్ మంత్రులు?
- అవమానకర రీతిలో మాట్లాడుతున్న వారి వెనుక అదృశ్య వ్యక్తులున్నారంటున్న కొండా దంపతులు

హైదరాబాద్:
తెలంగాణ అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఉచ్చు బిగుసుకుంటోంది. ఇటీవల ఆమెకు వ్యతిరేకంగా సొంత పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు గళం విప్పారు. మంత్రివర్గం నుంచి బహిష్కరించాలంటూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. కొందరు మంత్రులు, సీనియర్ నేతలు.. ఆమె పట్ల అంటిముట్టనట్టుగా ఉంటున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలపై అటు కొండా సురేఖ కూడా స్పందించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణా కమిటీకి వివరణ ఇచ్చినప్పటికీ.. కొందరు నేతలు బహిరంగంగా అవమానకర రీతిలో మాట్లాడుతున్నారని, వారి వెనుక ఉన్న

-మిగతా 2 లో

### గుజరాత్‌లో కల్తీ మద్యం

## 13 మంది మృతి



02

### యుద్ధ బాధితులు

## యూఎస్ జవాన్లు



- ఇరాన్‌తో ఘర్షణలో 18 మంది మృతి
- 756 మందికి గాయాలు
- వార్‌కు ఆరు నెలలు
- పెంటగాన్ నివేదిక వెల్లడి

02

## అంతరిక్ష రంగంలో అద్భుతాలు చేద్దాం



- ప్రపంచ ప్రతిభను అయస్కాంతంలా ఆకర్షిద్దాం
- అందుకు తగిన వాతావరణం సృష్టిద్దాం
- అంతరిక్ష రంగంలో గట్టి పోటీ ఇద్దాం
- నిలకడతో కూడిన విధానాలు తీసుకొస్తాం
- రిస్క్ తీసుకునే వారికి భరోసా ఇస్తాం
- ప్రతిభ, నాణ్యతలో రాజీలేదు .. రైతుల దిగుబడి పెంపుదలకు సాయపడండి
- స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులకు ప్రధాని మోడీ పిలుపు

02

# అంతరిక్ష రంగంలో అద్భుతాలు చేద్దాం

-ప్రపంచ ప్రతిభను అయస్కాంతంలా ఆకర్షిద్దాం
-అందుకు తగిన వాతావరణం సృష్టిద్దాం
-అంతరిక్ష రంగంలో గట్టి పోటీ ఇద్దాం
-నిలకడతో కూడిన విధానాలు తీసుకొస్తాం
-రిస్క్ తీసుకునే వారికి భరోసా ఇస్తాం
-ప్రతిభ, నాణ్యతలో రాజీలేదు ..
రైతుల దిగుబడి పెంపుదలకు సాయపడండి ..
- స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులకు ప్రధాని మోడీ పిలుపు



న్యూఢిల్లీ:
ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారత అంతరిక్ష స్టార్టప్‌లను ప్రశంసించారు. కొత్త రంగంలోకి ప్రవేశించి ధైర్యం చూపించినందుకు వారిని అభినందిస్తూ, ప్రపంచవ్యాప్త ప్రతిభను భారత అంతరిక్ష రంగం వైపు ఆకర్షించేలా ఒక ప్రత్యేక వాతావరణం సృష్టించాలని పిలుపునిచ్చారు. ఆదివారం సోషల్ మీడియాలో భారత అంతరిక్ష స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులతో తాను జరిపిన సమావేశం వీడియోను పంచుకున్న ప్రధానమంత్రి మోడీ, వారి శక్తి, ఆశయాలకు తాను ఎప్పటిలాగే ఆకర్షితుడిని అయ్యానని పేర్కొన్నారు. భారత అంతరిక్ష ప్రయాణం గురించి వారి అవగాహనలు, ఆశావాహ దృక్పథం అందరికీ నచ్చుతాయని అన్నారు. భారత అంతరిక్ష ప్రయాణంలో మీకు ఏది ఎక్కువ ఉత్సాహం కలిగిస్తుందో చెప్పండని ప్రజలను అడిగారు.

మీ నమ్మకాలకు తగ్గట్టుగా నిలకడైన విధానాలు

సీఈఓలు, వ్యవస్థాపకులతో మాట్లాడుతూ ప్రపంచ నలుమూలల నుంచి వచ్చే వ్యక్తులు ఈ రంగంలో జీవితాన్ని నిర్మించుకోవాలనుకుంటే భారత్‌కు రావాలని భావించేలా ఒక ప్రత్యేక వాతావరణం సృష్టించాలని నమ్ముతున్నాను. వారు భారత స్టార్టప్‌లలో చేరాలి లేదా భారత అంతరిక్ష సంస్థలో చేరాలి అని భావించాలి. స్థిరమైన విశ్వసనీయ ప్రభుత్వ విధానాలు చాలా ముఖ్యమని ప్రధానమంత్రి మోడీ అన్నారు. ఎందుకంటే అవి రిస్క్ తీసుకునే వ్యాపారవేత్తలకు పెట్టుబడి పెట్టేందుకు విశ్వాసం కలిగిస్తాయి. కొత్త రంగంలో మీరు ధైర్యం చూపారు అని ప్రధాన మంత్రి అన్నారు. అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే మీరు ప్రభుత్వంపై విశ్వాసం పెట్టారు. మేము తీసుకునే నిర్ణయాలు ఎల్లప్పుడూ స్థిరంగా ఉండాలని నా అభిప్రాయం. వాటిని నిరంతరం మార్చకూడదు. అలా చేస్తే రిస్క్ తీసుకునేవారికే వారికి భరోసా కలుగుతుంది. వారి స్వంత తప్పుల వల్ల ఏదైనా జరిగితే అది వేరే విషయం కానీ ఎవరూ వారిని వదిలేస్తారు అనే నమ్మకం ఉండాలి. అటువంటి విశ్వాసాన్ని నిర్మించడమే మా లక్ష్యం అని ఆయన చెప్పారు. భారత్ అంతరిక్ష రంగం ప్రపంచ ప్రతిభా సమూహాన్ని ఆకర్షించగలదని ప్రధానమంత్రి మోడీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ మొత్తం ప్రతిభా సమూహాన్ని ఆయన స్వయంగా ఆకర్షించగలమని, అది మనకు అపార బలంగా మారుతుందని నేను నమ్ముతున్నాను అని అన్నారు.

దిగుబడి పెంపుదలకు సాయపడండి

వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న అంతరిక్ష సాంకేతిక సంస్థలు వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, శాఖలతో సహకరించి రైతులు మెరుగైన నిర్ణయాలు తీసుకుని దిగుబడిని పెంచుకునేలా సహాయం చేయవచ్చని చెప్పారు. ప్రపంచం అంతరిక్ష రంగం గురించి ఆలోచించినప్పుడు భారత్ వైపు చూసేలా ఒక వ్యవస్థ, వాతావరణం సృష్టిస్తాం చాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌తో మరింత సన్నిహిత సహకారం కావాలని అన్నారు. దీనివల్ల చిన్న వయస్సు నుంచే పిల్లల్లో అంతరిక్ష రంగంపై ఉత్సుకత, ఆసక్తి పెరుగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో అంతరిక్ష రంగంలో పనిచేస్తున్న 20 స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులు పాల్గొన్నారు. 2023, ఆగస్టు 23న చంద్రయాన్-3 చంద్రుని దక్షిణ ధ్రువం సమీపంలో విజయవంతంగా, మృదువైన ల్యాండింగ్ చేసిన చారిత్రక విజయాన్ని గుర్తుచేసుకుంటూ ప్రతి సంవత్సరం ఈ రోజును జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నారన్నారు. భారత్ ప్రపంచంలో నాల్గవ దేశంగా చంద్రునిపై అంతరిక్ష నౌకను దించి దక్షిణ ధ్రువం సమీపంలో ల్యాండ్ చేసిన మొదటి దేశంగా నిలిచింది.

ప్రతిభ, నాణ్యతలో రాజీలేదు

మనం అత్యధికంగా ఖర్చుపెట్టే పోటీదారులం. ప్రతిభ, నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. మన దేశ ప్రజలు సహజంగా రిస్క్ తీసుకునే సామర్థ్యం ఎక్కువగా కలిగి ఉన్నందున మనం తరచూ మనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోగలమని మోడీ చెప్పారు. అంతరిక్ష సంస్థలు తమ సాంకేతికతలకు కొత్త అనువర్తనాలను అన్వేషించాలని, ప్రజల జీవితాలను ఎలా సులభతరం చేయవచ్చో దృష్టి సారించాలని ప్రధానమంత్రి ప్రోత్సహించారు. అంతరిక్ష రంగ సంస్థలు ఇతర రంగాల్లో పనిచేస్తున్న సంస్థలతో మరింత సహకారం పెంచుకోవాలని సూచించారు. ఉదాహరణగా అంతరిక్ష వైద్యంలో పనిచేస్తున్న సంస్థలు వైద్యరంగ సంస్థలతో కలిసి పనిచేసి తమ సాంకేతికతలను విస్తృత స్థాయిలో ఉపయోగించుకోవచ్చని అన్నారు.

# యుద్ధ బాధితులు యూఎస్ జవాన్లు

-ఇరాన్‌తో ఘర్షణలో 18 మంది మృతి
-756 మందికి గాయాలు
-వార్‌కు ఆరు నెలలు
-పెంటగాన్ నివేదిక వెల్లడి



వాషింగ్టన్:
అమెరికాలో పెంటగాన్ అందించిన సమాచారం ప్రకారం ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమెరికా సైన్యంలో గాయపడిన, ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 770కి పైగా పెరిగింది. ఈ సంఘర్షణ ఇప్పుడు ఆరో నెలలోకి అడుగుపెట్టింది. వాషింగ్టన్ పోస్ట్ నివేదిక ప్రకారం పెంటగాన్ క్యాజువాల్టీ రిపోర్టింగ్ సిస్టమ్‌లో 774 మంది అమెరికా సైనికులు మరణించినట్లు లేదా గాయపడినట్లు నమోదైంది. వీరిలో 18 మంది మరణించగా 756 మంది గాయపడ్డారు. ఇటీవల రోజుల్లో అనేక మంది కొత్త సైనికులను గాయపడిన వారి జాబితాలో చేర్చారు. అయినా అమెరికా-ఇరాన్ మధ్య ఇటీవల వారాల్లో ఎక్కువగా కాల్పుల విరమణ కొనసాగుతోంది. జూన్‌లో సంతకం చేసిన 14 అంశాల అవగాహన ఒప్పందం ప్రకారం కాల్పుల విరమణ సోమవారం ముగిసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాన్ని పొడిగించలేదు. అయితే అప్పటినుంచి ఇరు పక్షాల నుంచి పెద్ద ఎత్తున పోరాట కార్యకలాపాలు తిరిగి ప్రారంభం కాలేదు. సీఎన్ఎన్ నివేదిక ప్రకారం బుధవారం నాటికి గాయపడిన అమెరికా సైనికుల సంఖ్య 750ని దాటింది. డిఫెన్స్ క్యాజువాల్టీ అనాలసిస్ సిస్టమ్‌లో ఓవర్‌సీస్ ఆపరేషన్స్ గణాంకాలను ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ గణాంకాలతో కలిపితే ఫిబ్రవరి 28న అమెరికా ఇరాన్‌పై యుద్ధం ప్రారంభించినప్పటి నుంచి 18 మంది సైనికులు మరణించినట్లు తెలుస్తోంది. ఈ సంఘర్షణ ఆరు నెలలుగా కొనసాగుతూ అమెరికా సైనిక నష్టాలు క్రమంగా పెరుగుతున్నాయని నివేదికలు సూచిస్తున్నాయి.

# కొండాపై గరం గరం

మొదటి తరువాయి

అదృశ్య వ్యక్తులెవరో గుర్తించి, వారిపై పార్టీ క్రమశిక్షణా నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్ మల్లు రవికి లేఖ రాశారు. పార్టీ నాయకత్వం, క్రమశిక్షణా నియమావళిపై తనకు గౌరవం ఉందని, నోటీసును ఉపసంహరించుకోవాలని కూడా కోరారు. వీటినేవీ కూడా టీపీసీసీ పరిగణనలోకి తీసుకోవట్లేదు. దీనికి తాజా ఉదాహరణ.. కొండా సురేఖ భర్త కొండా మురళీకి పార్టీ సీనియర్ నాయకులు అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు, ఆ తరువాత చోటు చేసుకుంటున్న పరిణామాలపై పార్టీ సీనియర్ నాయకులను వ్యక్తిగతంగా కలిసి వివరణ ఇవ్వాలని కొండా మురళి రెండు రోజులుగా ప్రయత్నిస్తున్నారు. దీనిపై ఎవరూ సానుకూలంగా స్పందించట్లేదని తెలుస్తోంది. తాజాగా ఆయన పార్టీ సీనియర్ నాయకుడు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అపాయింట్‌మెంట్ కోరగా.. అందుకు ఆయన నిరాకరించారని సమాచారం. ఇది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వాస్తవ పరిస్థితులను వివరించి, తన వైఖరిని స్పష్టం చేయడానికి కొండా మురళి డిప్యూటీ సీఎంను కలవాలని భావించారు. ఆయనకు అపాయింట్‌మెంట్ నిరాకరించడంతో దాదాపుగా కొండా సురేఖ విషయంలో పార్టీ ఓ స్పష్టమైన నిర్ణయానికి వచ్చినట్లుగా చెబుతున్నారు. ప్రభుత్వం, పార్టీలోనూ అత్యంత కీలక స్థానంలో ఉన్న భట్టి విక్రమార్క అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం వెనుక బలమైన కారణాలు ఉన్నాయని అభిప్రాయాలు ఉన్నాయి. పార్టీలో క్రమశిక్షణను కాపాడేందుకే అధిష్టానం పెద్దలు ఈ వ్యూహాత్మక దూరాన్ని పాటిస్తున్నారా అనే అనుమానాలు బలపడుతున్నాయి. ఈ పరిణామం కొండా అనుచరులతో పాటు వరంగల్ జిల్లా కాంగ్రెస్ శ్రేణులలో చర్చనీయాంశమైంది. మరోవంక.. కొండా సురేఖ వద్ద ఓఎస్డీగా పనిచేస్తున్న తెలంగాణకు చెందిన సుమంత్ డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తెల్లాపూర్‌లో సుమంత్ ఇంటి వద్దే ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఓ వ్యాపారిని రూ.10 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేసి, ఇనుప రాడ్లతో దారుణంగా దాడి చేశాడని సుమంత్‌పై ఎఫ్ఐఆర్ నమోదయ్యింది. ఈ కేసు విచారణలో భాగంగా ఆయన డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కొండా సురేఖ ఆదేశాల మేరకు 2023 డిసెంబర్ 17వ తేదీన తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా జాయిన్ అయ్యారు సుమంత్. 2024 డిసెంబర్ 16వ తేదీ నాటికి ఆయన కాంట్రాక్ట్ గడువు ముగిసింది. అయినప్పటికీ.. దీన్ని మరో ఏడాది పాటు పొడిగించారు. 2025 డిసెంబర్ 16 వరకు ఆయన విధుల్లో కొనసాగాల్సి ఉన్నప్పటికీ.. అదే ఏడాది అక్టోబర్ 17వ తేదీన ప్రభుత్వం విధుల నుంచి తొలగించింది.

# మరింత బలపడుతున్న ఎల్ నినో..

మొదటి తరువాయి

సాధారణం కంటే తకువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నదని వెల్లడించారు. రుతుపవన ద్రోణి మధ్య భారతదేశం మీదుగా కదలడానికి బదులుగా హిమాలయ పాదాల వద్దే స్థిరంగా ఉండిపోవడంతో, ఇప్పటికే సగటు కంటే 14% తకువగా ఉన్న దేశవ్యాప్త వర్షపాత లోటు మరింత పెరిగే ప్రమాదం పొంచి ఉన్నదని పేర్కొన్నారు. ప్రైవేట్ వాతావరణ అంచనా సంస్థ స్కైమెట్ వెదర్ కూడా తన సవరించిన అంచనాలో రుతుపవన వర్షపాతం ఇప్పుడు దీర్ఘకాల సగటులో కేవలం 85% మాత్రమే ఉంటుందని తేల్చేసింది. ఏప్రిల్‌లోని 94% అంచనాతో పోలిస్తే ఇది తకువ. అలాగే కరువు వచ్చే అవకాశాలు 70% ఉన్నట్టు తెలిపింది. ఆగస్టులో మిగిలిన వారాల్లో దేశంలోని నాలుగు ఏకరీతి వర్షపాత ప్రాంతాల్లో అసమాన పంపిణీ ఉంటుందని స్కైమెట్ హెచ్చరించింది. బలపడుతున్న ఎల్ నినో, బలహీనపడిన హిందూ మహాసముద్ర ద్విధ్రువం కారణంగా సెప్టెంబరులో ఈ లోటు మరింత తీవ్రమవుతుందని అంచనా. తాజా పరిణామాల ప్రభావం వ్యవసాయం, ధరలపై తీవ్రంగా ఉంటుందనే హెచ్చరికలు వెలువడుతున్నాయి.

# సీజేపీ మరో ఉద్యమం?

-హామీల అమలులో జాప్యం.. కేంద్రంపై ఆగ్రహం
-దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమాలకు యోచన
-నేడు సీజేపీ జాతీయ వర్కింగ్ కమిటీ భేటీ
--తదుపరి కార్యాచరణపై కీలక సమీక్ష

COCKROACH JANTA PARTY

న్యూఢిల్లీ:
కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై క్రాంకోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేడు (ఆగస్టు 24న) జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశంలో సమీక్ష నిర్వహించనుంది. జులై 25న దేశవ్యాప్త ఆందోళనను విరమించిన సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం జరుగుతోందని సీజేపీ ఆరోపించింది. ప్రత్యేకంగా విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించడం లేదా కొట్టివేయడం, భవిష్యత్తులో శాంతియుత విద్యార్థి ఆందోళనకారులపై చర్యలు తీసుకోకపోవడం, నీట్ పరీక్ష రద్దు నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయిన అభ్యర్థుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం వంటి అంశాలపై హామీలను అమలు చేసేవిషయంలో కేంద్రంపై సీజేపీ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆగస్టు 18న విద్యార్థులు, నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్ సమగ్ర జాబితాను ఇవ్వాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు కోరిందని, అయితే ఆ జాబితాను కేంద్రం ఇంకా సమర్పించలేదని సీజేపీ ఆరోపించింది. కేంద్రం తమ హామీలను ఆలస్యం చేయడం, నీరుగార్చడాన్ని యువతకు చేసిన విశ్వాసఘాతుకంగా పరిగణిస్తామని సీజేపీ హెచ్చరించింది. హామీలు అమలు కాకపోతే మరోసారి శాంతియుత దేశవ్యాప్త ఆందోళన చేపట్టే అవకాశాన్ని పరిశీలిస్తామని తెలిపింది.

# బంగాళాఖాతంలో అల్పపీడనం

మొదటి తరువాయి

ఈ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేశారు. అలాగే ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, మెదక్ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ ప్రకటించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఇక రాజధాని హైదరాబాద్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆగస్టు నెలలో రాష్ట్రానికి ఇవే తొలి హెచ్చరికలు కావడంతో వాతావరణంలో వస్తున్న మార్పుల పట్ల ప్రజలు, అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# పెట్టుబడులు, విద్యపై ప్రత్యేక దృష్టి

మొదటి తరువాయి

తెలంగాణ అభివృద్ధి, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రవాస తెలంగాణ సమాజంతో ప్రభుత్వ అనుసంధానం, భవిష్యత్ కార్యాచరణ వంటి కీలక అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవాసులతో ముఖాముఖి చర్చించారు. రాష్ట్ర ప్రగతికి ప్రవాసుల అనుభవం, నైపుణ్యం, పెట్టుబడులు, ఆలోచనలు ఎంతో ఉపయోగపడతాయని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'తెలంగాణ రైజింగ్'కు ప్రవాస భారతీయులు బలమైన మద్దతుదారులుగా, రాయబారులుగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ ఆర్థిక, ఆవిష్కరణల శక్తి కేంద్రంగా తెలంగాణ ఎదుగుతున్న ప్రయాణంలో ప్రవాసులు చురుకైన భాగస్వాములు కావాలని ఆయన ఆహ్వానించారు. ఎన్నారైలు, పెట్టుబడిదారులు, వివిధ రంగాల నిపుణులతో స్వయంగా ముఖాముఖి అయిన సీఎం.. రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడే కొత్త ఆలోచనలు, సూచనలు అందించాలని కోరారు. ప్రవాస తెలంగాణ సమాజం మధ్య నెట్‌వర్కింగ్‌ను మరింత బలోపేతం చేయడం ద్వారా తెలంగాణలో కొత్త అవకాశాలను సృష్టించేందుకు కలిసి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో 'పెట్టుబడులు, విద్యారంగం, ఎన్నారైలతో తెలంగాణ ప్రభుత్వ అనుసంధానం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. ఖఖతో, యూరప్‌లో ఉన్న పెట్టుబడిదారులు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా మరింత అనుకూల వాతావరణం కల్పించడం, విద్యారంగంలో అంతర్జాతీయ అనుభవాన్ని రాష్ట్రానికి అనుసంధానం చేయడం, ప్రవాస నిపుణుల సేవలను తెలంగాణ అభివృద్ధికి వినియోగించుకోవడం వంటి అంశాలపై చర్చ జరిగింది.

సీఎం రేవంత్ రెడ్డికి సుధాకర్ గౌడ్ ప్రశంసలు

కార్యక్రమ నిర్వాహకుడు, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ పీసీసీ ఎన్నారై కన్వీనర్ సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి లండన్‌తో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. గతంలో లండన్ పర్యటన సందర్భంగా గల్ఫ్ ఎన్నారైలకు ఇచ్చిన హామీని నెరవేర్చిన విషయాన్ని ప్రస్తావించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి రేవంత్ రెడ్డి ఎంతో కష్టపడ్డారని, ఆయనకు లండన్‌లోనే కాకుండా యూకేలోని ప్రవాస భారతీయులు, తెలంగాణ సమాజంలో పెద్ద సంఖ్యలో అభిమానులు ఉన్నారని సుధాకర్ గౌడ్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేసినా, ఆయనకు అండగా నిలిచే అభిమానులు, కార్యకర్తలు ఉన్నారని అన్నారు. యూకేలో ఉన్న పెట్టుబడులు, విద్యా అవకాశాలు, ఎన్నారైల అవసరాలకు తెలంగాణ ప్రభుత్వంతో నేరుగా అనుసంధానం కల్పించేలా ఒక బలమైన వారధి ఉండాలని సుధాకర్ గౌడ్ కోరారు. యూకేలోని తెలంగాణ సమాజం, పెట్టుబడిదారులు, విద్యావేత్తలు రాష్ట్ర ప్రభుత్వంతో మరింత సమన్వయంతో పనిచేసేలా ప్రత్యేక వ్యవస్థ అవసరమని సూచించారు. ఈ ప్రతిపాదనపై మంత్రి శ్రీధర్ బాబు, సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు సుధాకర్ గౌడ్ తెలిపారు. డిసెంబర్‌లో నిర్వహించనున్న తదుపరి గ్లోబల్ సమ్మిట్ బిజినెస్ మీట్‌కు యూకేలోని పెట్టుబడిదారులు, నిపుణులను ఆహ్వానిస్తామని వారు వెల్లడించినట్లు చెప్పారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఎన్నారై పాలసీ, ఇన్వెస్ట్‌మెంట్ పాలసీ గురించి సవివరంగా వివరించారు. అలాగే యూకే, యూరప్‌కు భారత్‌తో వేగవంతమైన కనెక్టివిటీ ఉన్నందున, అక్కడి ఎన్నారైలు, పెట్టుబడిదారులు, నిపుణులకు అనుకూలంగా ప్రత్యేక విధివిధానాలను రూపొందించే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నిర్వహించిన ప్రశ్నోత్తరాల సెషన్‌లో తెలంగాణ విద్యా వ్యవస్థకు సంబంధించిన అంశాలు ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడం, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దడం వంటి అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి ఎన్నారైలు, విద్యావేత్తలతో సుదీర్ఘంగా చర్చించారు. విదేశాల్లో పనిచేస్తున్న తెలంగాణకు చెందిన నిపుణుల అనుభవం, జ్ఞానం, ఆలోచనలను రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగించుకునేలా ప్రభుత్వం, ప్రవాస తెలంగాణ సమాజం మధ్య మరింత సమన్వయం అవసరమని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. విదేశాల్లోని నిపుణుల అనుభవాన్ని తెలంగాణ ప్రగతికి వినియోగించుకోవడం, ప్రభుత్వంతో ప్రవాస సమాజానికి మరింత బలమైన అనుసంధానం కల్పించడం వంటి అంశాలపై సమావేశం ద్వారా స్పష్టమైన దిశ ఏర్పడింది. సుధాకర్ గౌడ్ నాయకత్వంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ 'లండన్ మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమం ప్రవాస తెలంగాణ సమాజం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మధ్య అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసే వేదికగా నిలిచింది. తెలంగాణ అభివృద్ధిలో ప్రవాసుల భాగస్వామ్యాన్ని పెంచడంతో పాటు పెట్టుబడులు, విద్య, నైపుణ్యం, అంతర్జాతీయ అనుభవాలను రాష్ట్ర ప్రగతికి అనుసంధానం చేసే దిశగా ఈ సమావేశం కీలకంగా మారింది.

# పార్లమెంట్ మళ్లీ సమావేశమయ్యేనా!

మొదటి తరువాయి

మూడు నాలుగు రోజుల తర్వాత (ఒక్కోసారి అదే రోజు) అధికారికంగా సమావేశ కాలం ముగిసినట్టు ప్రొరోగేషన్ నోటిఫికేషన్ జారీ చేయాలి.అయితే ఆదివారం వరకు వర్షాకాల సమావేశాలకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వు విడుదల చేయలేదు. డీలిమిటేషన్‌తో ముడిపడి ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును ఎట్టి పరిస్థితుల్లో ఆమోదించి, 2029 పార్లమెంట్ ఎన్నికల నాటికి రిజర్వేషన్లు కల్పించాలన్న ధ్యేయంతో ఉన్న బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌ను తిరిగి సమావేశ పరుస్తుందన్న ప్రచారం జరుగుతున్నది. వర్షాకాల సమావేశాలు నిరవధిక వాయిదా పడి 10 రోజులైనా అధికారిక నోటిఫికేషన్ విడుదల చేయకపోవడాన్ని కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేశ్ ఆదివారం ప్రశ్నించారు

# గుజరాత్‌లో కల్తీ మద్యం 13 మంది మృతి

మొదటి తరువాయి

గాంధీనగర్, ఆగస్టు 23
మద్యపాన నిషేధం అమల్లో ఉన్న గుజరాత్‌లో కల్తీ మద్యం సేవించి మరణించిన వారి సంఖ్య ఆదివారం 13కు చేరుకుంది. భావ్‌నగర్ పరిసరాల్లో కొద్ది రోజుల క్రితం ఇండియన్ మేడ్-ఫారిన్ లిక్కర్ బ్రాండ్ పేరుతో ఉన్న కల్తీ మద్యాన్ని 67 మంది సేవించగా, పలువురు తీవ్ర అస్వస్థతకు గురై దవాఖానల్లో చేరారు. గత రెండు రోజుల్లో ఐదుగురు బాధితులు ప్రాణాలు కోల్పోగా, ఆదివారం మరో ఇద్దరు చనిపోయారు.బాధితులు సేవించిన కల్తీ మద్యంలో విషపూరిత ద్రావణం మెథనాల్ ఉన్నట్టు ఫోరెన్సిక్ పరీక్షల్లో తేలింది. ఈ విషాద ఘటనపై వార్తేజ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. 21 మందిని నిందితులుగా పేర్కొన్నారు. దీంట్లో 13 మందిని అరెస్టు చేశారు. ఆగస్టు 16న ముగ్గురు స్నేహితులు మద్యం సేవించిన తర్వాత తీవ్ర అనారోగ్యంతో దవాఖానలో ఒకరి తర్వాత ఒకరు మరణించారు. దీంతో కల్తీ మద్యం ఘటన వెలుగు చూసింది.

# కాంగ్రెస్ దగా పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

మొదటి తరువాయి

ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కమిటీతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులంతా ఏకతాటిపైకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగట్టేలా కార్యాచరణను విజయవంతం చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

వంద రోజుల్లో అమలు చేస్తామన్న హామీలేవీ సంపూర్ణంగా నెరవేర్చలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు. వెయ్యి రోజులు పూర్తయినా హామీలను సంపూర్ణంగా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ప్రభుత్వ పరిపాలనా వైఫల్యం, అవినీతి, అరాచకాల పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధంగా ప్రజలను మోసం చేసిందో ప్రతి వర్గానికి అర్థమయ్యేలా వివరించేందుకు వచ్చేనెల రెండు నుంచి భారీ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమాలు కేవలం హామీల చుట్టూ కాకుండా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చోటుచేసుకున్న వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ప్రధానంగా ప్రస్తావించాలని సూచించారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీల బకాయిలను మరోసారి 'బాకీ కార్డుల' రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. రైతు కూలీలు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, యువతకు ప్రతి నెలా ఇస్తామన్న ఆర్థిక సహాయం ఎంత మేరకు పేరుకుపోయిందో ఈ బాకీ కార్డుల ద్వారా ప్రజలకు గుర్తు చేయాలని పిలుపునిచ్చారు.

వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల మాజీ చైర్మెన్లు, జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్లు సహా అన్ని స్థాయిల నాయకులు పాల్గొనాలని కోరారు. నిరసన కార్యక్రమాలను వినూత్నంగా నిర్వహించాలని సూచించారు.

# ఒకవైపు అంజయ్య నగర్ మరోవైపు ఎల్బీనగర్

## ఎల్బీనగర్‌లో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపూ లేదా.?

- కోర్టు కేసులున్నా కొనసాగుతున్న పనులు
- టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై తీవ్ర ఆరోపణలు
- అంజయ్యనగర్ ఘటన తర్వాత కూడా మారని పరిస్థితులు
- అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణకు ప్రజల డిమాండ్
- సహకరిస్తున్న సెక్షన్ ఆఫీసర్, ఏసీపి పై చర్యలకు స్థానికుల డిమాండ్




**ఎల్బీనగర్,ఆగస్టు23 (నేటి దర్శిని):** ఒకవైపు అంజయ్యనగర్‌లో జరిగిన ఘోర ప్రమాదం నగర ప్రజలను కలవరపెడుతుండగా.. మరోవైపు ఎల్బీనగర్‌లో అక్రమ నిర్మాణాలు యమ స్పీడుతో కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ అర్చన తీరుపై స్థానికులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అనేక అక్రమ నిర్మాణాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోకుండా మౌనం వహిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణదారులతో చేతులు కలిపి పత్రికలో కథనాలు వచ్చిన ఫిర్యాదులు చేసిన అసలు పట్టించుకోవడం లేదని ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి.

### కోర్టు కేసులున్నా డోంట్ కేర్.?

ఎల్బీనగర్ పరిధిలోని పలు నిర్మాణాలకు సంబంధించి న్యాయస్థానాల్లో వివాదాలు కొనసాగుతున్నప్పటికీ, నిర్మాణ పనులు మాత్రం ఆగడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోర్టు పరిధిలో ఉన్న నిర్మాణాలపై అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉండగా.. పనులు నిరంతరాయంగా సాగుతున్నాయనే ఆరోపణలు అధికారుల పనితీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. కోర్టు ఆదేశాలు, జీహెచ్ఎంసీ నిబంధనలు ఉల్లంఘించబడుతున్నాయా అనే అంశంపై జోనల్ కమిషనర్, ఉన్నతాధికారులు వెంటనే దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

### అక్రమార్కులకు అండగా అధికారిని అర్చన.?

టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ అర్చన అక్రమ నిర్మాణదారులకు పూర్తిగా సహకరిస్తున్నారంటూ కొందరు స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు. నిర్మాణ అనుమతులు, సెట్‌బ్యాక్‌లు, భవన నిర్మాణ నిబంధనలు, కోర్టు వివాదాలు వంటి అంశాలను పరిశీలించకుండా పనులు కొనసాగేందుకు పూర్తి సహకారం కల్పిస్తున్నారని వారు అంటున్నారు. అయితే విజిలెన్స్ విచారణ చేపిస్తే పూర్తి విషయాలు బయటికి వస్తాయని స్థానికులు కోరుతున్నారు. టౌన్ ప్లానింగ్ ఏసిపి అధికారుల వివరణ తీసుకుని వాస్తవాలను వెలుగులోకి



తేవాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది.

### లంచాల ఆరోపణలపై విచారణ ఏదీ.?

అక్రమ నిర్మాణాలకు సంబంధించి ముడుపులు చేతులు మారుతున్నాయనే ఆరోపణలు కూడా తీవ్రంగా వినిపిస్తున్నాయి. లంచాలు తీసుకుని అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారు అంటూ స్థానికులు మండిపడుతున్నారు. అయితే ఇవి తీవ్రమైన ఆరోపణలు కావడంతో అవి నిజమా కాదా అన్నది స్టేట్ విజిలెన్స్ అధికారులచే విచారణ ద్వారా తేలాల్సి ఉంది. అవినీతి ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### ప్రజల ప్రాణాలతో చెలగాటమా.?

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగితే భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ నాణ్యత, ఫైర్ సేఫ్టీ, అత్యవసర మార్గాలు, భవన స్థిరత్వం వంటి అంశాల్లో నిర్లక్ష్యం జరిగితే అమాయక ప్రజలు మూల్యం చెల్లించాల్సి వస్తుందని వారు హెచ్చరిస్తున్నారు. అంజయ్యనగర్ ఘటన నుంచి అయిన జిహెచ్ఎంసి కమిషనర్లు, జోనల్ కమిషనర్లు అధికారులు పాఠాలు నేర్చుకుని ముందస్తు కఠిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

### కూల్చివేతల చర్యలు ఎప్పుడు.?

ఎల్బీనగర్ పరిధిలో అనుమతులు లేకుండా లేదా



నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాలపై జిహెచ్ఎంసి విజిలెన్స్, స్టేట్ విజిలెన్స్ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. కోర్టు పరిధిలో ఉన్న నిర్మాణాల వివరాలను సేకరించి, న్యాయస్థాన ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### అక్రమ నిర్మాణాలకు ఎవరు సహకరిస్తున్నారు.?

అనుమతులు ఎలా వచ్చాయి.? ఫిర్యాదులు వచ్చిన తర్వాత ఏ చర్యలు తీసుకున్నారు.? కోర్టులో ఉండగానే నిర్మాణ పనులు ఎలా జరుగుతున్నాయి.? కోర్టు ఆదేశాలను అధికారులు ఎందుకు అమలు చేయడం లేదు.? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు బయటపడతాయని వారు అంటున్నారు.
ఇప్పటికైన మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, ఉన్నతాధికారులు స్పందించాలి.
ఎల్బీనగర్‌ను అక్రమ నిర్మాణాల అడ్డాగా మార్చకుండా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై స్టేట్ విజిలెన్స్ విచారణ జరిపి, తప్పు చేసిన వారు ఎవరైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రజల భద్రతే మొదటి ప్రాధాన్యంగా ఉండాలని, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై కూడా పారదర్శక విచారణ జరగాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలపై మరిన్ని ఆధారాలు వెలుగులోకి వస్తే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రజలకు తెలియజేయాలని స్థానికులు అంటున్నారు.

---

# భక్తిశ్రద్ధలతో మైసమ్మ తల్లి ద్వితీయ వార్షికోత్సవం



**ఆమనగల్లు, ఆగస్టు23 (నేటి దర్శిని);** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలోని సురసముద్రం చెరువు కట్ట పై కొలువుదీరిన కట్ట మైసమ్మ తల్లి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేవాలయ ఆవరణలో ప్రత్యేక పూజలు, హోమాలు సద్గురు శాంకరి అఘోరి మాత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎండుమిరపకాయలతో జరిపే హోమాది కార్యక్రమాల్లో 9వ వార్డు కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్, మాజీ సర్పంచ్, ఆమనగల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు,భక్తులు తదితరులుపాల్గొన్నారు.

## హైదరాబాదులో 'జన జాగరణ సభ'లో పాల్గొన్న ఆమనగల్లు మండల ఉద్యోగ ఉపాధ్యాయులు



**ఆమనగల్లు, ఆగస్టు23(నేటి దర్శిని);** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఆదివారం రాష్ట్ర టీఎస్ సిపిఎస్ఈ యు అధ్యక్షుడు స్థితప్రజ్ఞ ఆధ్వర్యంలో సిపిఎస్ ఉద్యోగుల జన జాగరణ సభను నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది ఉద్యోగ ఉపాధ్యాయులు హాజరైనారు. పెన్షన్ మా హక్కు. బిక్ష కాదు, సిపిఎస్ ని రద్దుచేసి ఓ పి ఎస్ అమలు చేయాలని పాల్గొన్న ఉద్యోగ ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఉద్యోగ ఉపాధ్యాయులు భారీగా ఈ సభకు తరలివచ్చారు. ఈ సభలో పాల్గొన్న ఆమనగల్లు మండల ఉపాధ్యాయులు తలారి శ్రీనివాసులు,విజయ ఉమామహేశ్వరి,సంతోషి, సునీత,జ్యోతిర్మయి,స్వప్న తదితరులు పాల్గొన్నారు.

---

# ఆమనగల్ లో ఘనంగా శ్రీ సుర్ర సముద్రం కట్ట మైసమ్మ తల్లి ద్వితీయ వార్షికోత్సవం

- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. బోనాల సమర్పణ.. పూర్ణాహుతి.. అన్నప్రసాద వితరణ

**ఆమనగల్లు, ఆగస్టు 23, (నేటి దర్శిని):** ఆమనగల్ పట్టణ కేంద్రంలోని సుర్ర సముద్రం చెరువు కట్ట వద్ద కొలువుదీరిన శ్రీ కట్ట మైసమ్మ తల్లి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దేవాలయ కమిటీ చైర్మన్, 14వ వార్డు కౌన్సిలర్ ముక్తాల వెంకటయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వార్షికోత్సవ వేడుకలకు సద్గురు శాంకరి అఘోరి మాత హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, బోనాల సమర్పణ, గణపతి పూజ, కంకణధారణ, పూర్ణాహుతి తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కిటకిటలాడింది. తెల్లవారుజామునే ప్రారంభమైన పూజా కార్యక్రమాలుఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో వార్షికోత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం 6 గంటలకు పంచామృతాభిషేకం, 7 గంటలకు ప్రత్యేక పూజలు, 7.30 గంటలకు కంకణధారణ, 8 గంటలకు గణపతి పూజ నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, బోనాల సమర్పణతో పాటు ఆలయ సంప్రదాయాల ప్రకారం పూర్ణాహుతి





కార్యక్రమాన్ని నిర్వహించారు.
మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, 12.30 గంటలకు తీర్థప్రసాద వితరణ, ఒంటి గంటకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు.
ప్రముఖుల హాజరుఈ వార్షికోత్సవ వేడుకల్లో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, పీసీబీ ఠాకూర్ బాలాజీ సింగ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.
అలాగే హుజూర్‌నగర్ సీఐ చలమంద రాజు, ఎస్ఐ, కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, ఎర్రవోలు మహేష్, ఎనుమల్ల రమేష్, కో-ఆప్షన్ సభ్యులు అల్లాజీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, మాజీ కౌన్సిలర్ విజయకృష్ణ, సుందూరు ఝాన్సీ శేఖర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు తదితరులు హాజరయ్యారు.
పాతకోట శ్రీశైలం, గోరటి భరత్, లండం మల్లేష్, పురుగుల శివ, గంగా రవి, చెన్నంశెట్టి మల్లేష్, మనీ తదితరులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, ముక్తాల చిన్న వెంకటయ్య, ముక్తాల అంజయ్య, ఎర్రవోలు రాజు, మొక్తాల సాయి, ముక్తాల మని తదితరులు పాల్గొన్నారు.
భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల సమర్పణ, ప్రత్యేక పూజలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.
ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయడంతో కార్యక్రమం ప్రశాంతంగా, వైభవంగా కొనసాగింది.
శ్రీ కట్ట మైసమ్మ తల్లి ఆశీస్సులు ఆమనగల్లు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.

---

# గట్టు ఇప్పలపల్లిలో నూతన గ్రంథాలయ భవనానికి భూమిపూజ

**తలకొండపల్లి, ఆగస్టు 23, (నేటి దర్శిని):** తలకొండపల్లి మండలంలోని గట్టు ఇప్పలపల్లి గ్రామంలో సి ఎస్ ఆర్ నిధులతో మంజూరైన నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సహకరించిన నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి కాంగ్రెస్ పార్టీ వార్డు మెంబర్ రేణు రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రేణురెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా వ్యాప్తికి, విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి, యువత ఉపాధి అవకాశాలను అన్వేషించేందుకు గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. గట్టు ఇప్పలపల్లిలో గ్రంథాలయ భవనం ఏర్పాటు కావడం విద్యార్థులు,



యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జిన్నుకుంట్ల చంద్రశేఖర్, ఉప సర్పంచ్ విజయ్, వార్డు సభ్యులు కోళ్ల శ్రీను, రాజశేఖర్, అశోక్ గౌడ్, ఆసియా బేగం, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, యూత్



కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శివకుమార్, నాయకులు మట్ట అంజయ్య, నరేందర్ గౌడ్, బొడ్డే కిషన్, పరమేష్, స్వామి, సాదిక్, రాజు, శంకర్, జీవ తదితరులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్‌లో రిటైర్డ్ హిందూ టీచర్ కుటుంబం అనుమానాస్పద మృతి

**న్యూఢిల్లీ, ఆగస్టు 23 (నేటి దర్శిని)**
బంగ్లాదేశ్‌లో ఒక హిందూ కుటుంబం అనుమానాస్పదంగా మరణించింది. ఈ ఘటనతో స్థానిక హిందువులు మరోసారి ఉలిక్కిపడ్డారు. మృతుల్లో ఒక రిటైర్డ్ టీచర్, అతడి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటన బంగ్లాదేశ్, రంగ్‌పూర్ మెట్రోపాలిటన్ కొత్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి స్థానిక మీడియా, బంధువులు తెలిపిన వివరాలివి.గణపతి చక్రవర్తి (65) అనే వ్యక్తి రంగ్‌పూర్ జిల్లా స్కూల్ టీచర్‌గా పని చేసి, గత ఏడాది డిసెంబర్ 31న రిటైర్ అయ్యారు. ఆయన ఇటీవలే సొంత ఇల్లు నిర్మించుకుని, భార్య ప్రీతిలతా చక్రవర్తి (50), కూతురు అగామి చక్రవర్తి ప్రార్థి (23), కొడుకు ప్రియం చక్రవర్తి (12)తో కలిసి ఉంటున్నాడు. పిల్లల్లో అగామి ఇటీవలే ఇంగ్లీష్‌లో మాస్టర్స్ పూర్తి చేయగా, కొడుకు ఐదో తరగతి చదువుతున్నాడు. వీరి కుటుంబానికి స్థానికులతో, ఎవరితో ఎలాంటి విభేధాలు లేవు. అనుమానించదగ్గ శతృవులు కూడా లేరు. గణపతి చక్రవర్తి కుటుంబంతో బంధువులు చివరగా గత గురువారం ఫోన్‌లో మాట్లాడారు. ఆ



తర్వాత నుంచి ఆ కుటుంబంలోని నలుగురి ఫోన్లు స్విచ్ఛాఫ్ వచ్చాయి. దీంతో చాలాసార్లు ఫోన్ చేసినా.. ఎవరూ స్పందించలేదు. చివరకు శనివారం సాయంత్రం ప్రీతిలత సోదరి వారి ఇంటికి వచ్చింది. అప్పటికి ఇల్లు పూర్తిగా లాక్ చేసి ఉంది. గేట్లు వేసి ఉన్నాయి. ఇంటి లోపల నుంచి తలుపులు గొల్లెం పెట్టుకుని ఉన్నారు. దీంతో ఆమె పోలీసులకు సమాచారం అందించింది. వారు వచ్చి తలుపులు బద్ధలుకొట్టి చూడగా.. ఇంట్లో నలుగురు మరణించి ఉన్నారు. పై కప్పు మీద గణపతి, మెట్లమీద ప్రీతిలత, అగామి మరణించి ఉండగా, కొడుకు ప్రియం మృతదేహం బెడ్‌పై పడి ఉంది. దీంతో గణపతి బంధువులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. వారి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాల్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం తరలించారు. ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరించారు. వారి మరణానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇది హత్యా, ఆత్మహత్యా అనే కోణంలో విచారిస్తున్నారు. తమ వారిది హత్యే అని, నిందితులపై చర్యలు తీసుకోవాలని గణపతి బంధువులు కోరుతున్నారు. అయితే, ఈ ఘటనతో స్థానిక హిందువుల్లో మరోసారి కలకలం రేగింది. గతేడాది బంగ్లాదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో హిందువులపై దాడులు జరిగిన సంగతి తెలిసిందే.

# అమెరికాతో మేం యుద్ధంలో ఉన్నాం..

**- కెనడా ప్రధాని సంచలన వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ, ఆగస్టు 23 (నేటి దర్శిని)**
అగ్రరాజ్యం అమెరికా తో తాము యుద్ధంలో ఉన్నామని కెనడా ప్రధాని మార్క్ కార్నీ సంచలన వ్యాఖ్యలు చేశారు. కెనడా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 50 శాతం మేర సుంకాలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ఆయన తీవ్రంగా స్పందించారు. అమెరికా తీసుకున్న ఈ చర్యను తమ దేశంపై జరిగిన ఆర్థిక దాడిగా ఆయన అభివర్ణించారు. ఇటీవల ఇరు దేశాల మధ్య జరిగిన వాణిజ్య చర్చలు చివరి నిమిషంలో విఫలమయ్యాయి.అమెరికా విధించిన షరతులు తమ దేశ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసేలా, కీలక పరిశ్రమలను బలహీనపరిచేలా ఉన్నాయని, అందుకే తాము వాటిని అంగీకరించలేదని మార్క్ కార్నీ స్పష్టంచేశారు. మీపై దాడి జరిగినప్పుడు మీరు



యుద్ధంలో ఉన్నట్లే భావించాలని, ఇప్పుడు మాపై దాడి జరిగిందని, అందుకే మేం కూడా యుద్ధంలోనే ఉన్నామని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ట్రంప్ నిర్ణయానికి ప్రతీకారంగా అమెరికా నుంచి దిగుమతి అయ్యే స్టీల్, గృహోపకరణాలు, వ్యవసాయ పరికరాలు, ఎలక్ట్రానిక్స్ వంటి ఉత్పత్తులపై తాము కూడా సుంకాలు విధించనున్నట్లు ఆయన ప్రకటించారు. సుమారు 20 బిలియన్ డాలర్ల విలువైన కెనడా వస్తువులపై అమెరికా 50 శాతం సుంకాలు విధించింది. ఇది కెనడా వార్షిక ఎగుమతుల్లో దాదాపు 5 శాతానికి సమానం కావడం గమనార్హం. అయితే అమెరికా తన సుంకాలను తగ్గిస్తే తాము కూడా సానుకూలంగా స్పందిస్తామని మార్క్ కార్నీ తెలిపారు. అమెరికా నుంచి వచ్చే అల్యూమినియం, స్టీల్, మోటార్ వాహనాలపై ఉన్న సుంకాలను తొలగించడానికి సిద్ధంగా ఉన్నామని, అమెరికన్ ఆల్కహాల్ విక్రయాలను తిరిగి ప్రారంభించేలా తమ ప్రావిన్సులను ప్రోత్సహిస్తామని ఆయన పేర్కొన్నారు. ట్రంప్ అసాధ్యమైన షరతులు విధించడంవల్లే తాము ఒప్పందం నుంచి వైదొలగినట్లు మార్క్ కార్నీ

# పాకిస్తాన్ చుట్టూ చక్కర్లు కొడుతున్న టర్కీ యుద్ధ విమానాలు.. ఏం జరుగుతోంది

**న్యూఢిల్లీ, (నేటి దర్శిని)**
టర్కీకి చెందిన యుద్ధ విమానాలు వరుసగా పాకిస్తాన్ చుట్టూ చక్కర్లు కొడుతున్నాయి. పాకిస్తాన్ వస్తూ.. అక్కడి నుంచి తిరిగి వెళ్తూ.. ప్రయాణం సాగిస్తున్నాయి. మూడు రోజులుగా ఇదే పరిస్థితి ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తించాయి. ఆగష్టు 19, 20, 21 తేదీల్లో టర్కీ యుద్ధ విమానాలు అనేకం పాకిస్తాన్ వచ్చి వెళ్లాయి. అది కూడా వరుసగా వస్తూ, పోతూ ఉన్నాయి. ముఖ్యంగా టర్కీకి చెందిన సీ-130 హెర్క్యులెస్ అనే రవాణా విమానాలు ఎక్కువసార్లు ఇరు దేశాల మధ్య సంచరించాయి.ఈ యుద్ధ విమానాలు సరుకుల్ని రవాణా చేయగలవు. గడిచిన 60 గంటల్లో ఇవి పలుమార్లు టర్కీ నుంచి పాక్.. అక్కడి నుంచి టర్కీ వెళ్లాయి. ఉన్నట్లుండి ఇలా టర్కీ విమానాలు పాక్ ఎందుకు వెళ్తున్నాయి అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీని గురించి అధికారిక ప్రకటన ఏదీ లేదు. కానీ, విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. టర్కీ నుంచి పాకిస్తాన్‌లోని, రావల్పిండిలో ఉన్న నుర్ ఖాన్ ఎయిర్‌బేస్‌కు, కరాచీలోని మస్రూర్ ఎయిర్‌బేస్‌కు యుద్ధ విమానాలు రాకపోకలు



సాగించాయి. ఇది అసాధారణమైన ప్రక్రియ. ఇటీవల పాకిస్తాన్ తన రక్షణ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఆయుధాల నిల్వలను పెంచుకుంటోంది. అందుకే ప్రస్తుతం డ్రోన్ల (మానవ రహిత యుద్ధ విమానాలు)ను భారీగా కొనుగోలు చేస్తోంది. దీనిలో భాగంగా టర్కీ నుంచి భారీగా డ్రోన్లు, ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ (వైమానిక దాడి రక్షణ వ్యవస్థ)ను కొనుగోలు చేస్తోంది. వీటిని యుద్ధ విమానాల ద్వారా టర్కీ.. పాకిస్తాన్‌కు సరఫరా చేస్తోంది. భారీ స్థాయిలో పాకిస్తాన్‌కు టర్కీ డ్రోన్లు అందించినట్లు అంచనా. డ్రోన్లతోపాటు అత్యున్నత క్షిపణి రక్షణ వ్యవస్థను టర్కీ అందించింది. వీటిలో బేరక్టార్ టీబీ2 చాలా కీలకం. ఇది టర్కీ అభివృద్ధి చేసిన మిడ్ రేంజ్ డ్రోన్. దీన్ని టర్కీ.. గతంలో ఉక్రెయిన్‌కు కూడా అందించింది. ఈ డ్రోన్లను ఉక్రెయిన్.. రష్యాపై దాడికి వాడింది. అత్యంత ప్రభావవంతమైన డ్రోన్‌గా దీనికి పేరుంది. ఇటీవల టర్కీ, పాకిస్తాన్, సౌదీ అరేబియా మధ్య సైనిక, రక్షణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఇస్లామిక్ నాటోగా దీన్ని పిలుచుకుంటున్నారు. యుద్ధ సమయంలో ఒక దేశానికి మరో దేశం సహకరించుకోవాలనేది ఈ దేశాల మధ్య ఒప్పందం. దీనిలో భాగంగానే ఈ డ్రోన్లను పాకిస్తాన్‌కు టర్కీ సరఫరా చేస్తోందా అనే సందేహాలున్నాయి. పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ ఈ వ్యవహారాల్ని పర్యవేక్షిస్తున్నాడు.

# మైక్రో డ్రామా.. యువత హంగామా!

**భారత మార్కెట్‌ను ఆక్రమిస్తున్న సూక్ష్మ ఎపిసోడ్‌లు**
**వినోద రంగంలో ఫాస్ట్‌ఫుడ్‌గా ఆదరణ**
**సినిమాలు, సీరియళ్ల ట్రెండ్‌కు బ్రేక్ పడే అవకాశం**

**న్యూఢిల్లీ, (నేటి దర్శిని)**
నాటి షోలే నుంచి నేటి ధురంధర్ వరకు.. బాహుబలి నుంచి పుష్ప వరకు మూడు అంతకన్నా ఎక్కువ గంటల నిడివి ఉన్న సినిమాలను ఓపికగా చూడటానికి దశాబ్దాలుగా భారతీయ ప్రేక్షకులు అలవాటు పడిపోయారు. ఇక అనేక సీజన్ల పాటు సాగే ఓటీటీ వెబ్ సిరీస్‌లకు అంతే లేదు. అయితే ప్రస్తుత జెన్ జీ ఆ పరిస్థితిని మార్చేసింది. ఇప్పుడు మన దేశంలో మైక్రో డ్రామా బూమ్‌కు వస్తున్న ఆదరణ దాని పెరుగుదల ప్రాథమిక దశను చూస్తున్నది. యువ ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటంతో ఫోన్‌లో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లా వీటికి రానున్న రోజుల్లో మంచి డిమాండ్ ఏర్పడనున్నది. కథలు చిన్నగా, ఒక విధంగా సూక్ష్మంగా కేవలం ఒకటి రెండు నిమిషాల నిడివితో ఉన్న ఎపిసోడ్‌లను మైక్రో డ్రామాలుగా పేర్కొంటున్నారు. నించుని ఉన్నా,



కూర్చుని ఉన్నా, మాట్లాడుతున్నా, ఆఖరికి ఆఫీస్ పనిలో ఉన్నప్పుడు కూడా వీటిని చూస్తూ ఉండటం ప్రజలకు అలవాటుగా మారిపోతున్నది. ఇది మరొక భిన్న వీడియో ట్రెండ్ మాత్రమే కాదు. ప్రజలు కల్పిత కథనాలను స్వీకరించే విధానంలో ఇది ఒక మార్పును సూచిస్తున్నదని స్టోరీ టీవీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తెలిపారు. దీనికి సంబంధించిన ఎపిసోడ్‌లు 1-2 నిముషాలు (ఒక్కోసారి అంతకన్నా తక్కువగా) ఉంటాయని, గంటల తరబడి సాగే డ్రామాలకు ఇది తెర వేయవచ్చునని పేర్కొన్నారు.

అదే విధానం.. అదే కథలతో..

మైక్రో డ్రామాల నిడివి ఇంత తక్కువ వ్యవధి మాత్రమే ఉన్నా ప్రాథమికంగా కథ చెప్పే విధానంలో ఎలాంటి మార్పు ఉండదు. మామూలు కథల్లాగా అందులో కూడా ఒక హీరో, హీరోయిన్, విలన్, కుటుంబ బాంధవ్యాలు, సంఘర్షణ, హాస్యం ఉంటాయి. దీని ఫలితంగా ఒకే సమయంలో కొత్తగా, వింతగా సుపరిచితంగా అనిపించే ఒక వినోద రూపం ఆవిష్కృతమవుతుంది. దీని మార్కెట్ ఆ దేశంలో సుమారు 10 బిలియన్ డాలర్లకు చేరుకుంది.

మెరుపులా వచ్చి.. నిమిషంలో ముగిసి..

భారత్‌లో ఈ ఇండస్ట్రీ అభివృద్ధి మెల్లిమెల్లిగా విస్తరించడం ఖాయంగా కనిపిస్తున్నది. కోట్లాది మంది స్మార్ట్‌ఫోన్లను వినియోగిస్తున్న క్రమంలో మైక్రో డ్రామా మార్కెట్ భారత్‌లో అభివృద్ధి చెందేందుకు మంచి అవకాశాలు ఉన్నాయని చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు పేర్కొంటున్నారు. రెండున్నర గంటల సినిమా చూడాలంటే పూర్తి సమయం దానికి వెచ్చించాల్సిందే. కాబట్టి మెరుపులా వచ్చి నిమిషంలో ముగిసే మైక్రో డ్రామాలకు రాబోయే రోజుల్లో మంచి డిమాండ్ ఏర్పడేలా ఉంది.

## సంపాదకీయం

# కలసి ఉంటేనే కమ్యూనిస్టులకు కలదు సుఖం



కమ్యూనిస్టు శ్రేయోభిలాసులు, సానుభూతి పరులు, అభిమానులు, ప్రజాతంత్ర మేధావులు కమ్యూనిస్టు పార్టీలన్నీ ఐక్యం కావాలని కోరుకుంటున్నారు. కమ్యూనిస్టుల ఐక్యత వల్ల మోడీ ప్రభుత్వ, ఆర్ఎస్ఎస్ ఫాసిస్ట్ విధాలను అడ్డుకోవడం సాధ్యం అవుతుందని చెబుతున్నారు. ఐక్యతను కోరుకుంటూ సదస్సులు జరుపుతున్నారు. ఆ విధంగా తమ ఆకాంక్షను వెలిబుచ్చుతున్నారు. భారత కమ్యూనిస్టులు అందరూ ఒకే మార్క్సిస్టు- లెనినిస్టు పార్టీగా ఏర్పడితేనే బలీయమైన విప్లవోద్యమాన్ని నిర్మించి నేటి దోపిడీ వ్యవస్థను మార్చడం సాధ్యం అవుతుంది. ఐక్యత అనేది మోడీ ప్రభుత్వ, ఆర్ ఎస్ఎస్ ఫాసిస్ట్ విధానాలను, మత విద్వేసాలను ఎదుర్కొనే అంశానికి పరిమితం కాకూడదు. నేటి వ్యవస్థను సమూలంగా మార్చేందుకు ఉమ్మడి అవగాహనతో పంథా, కార్యక్రమం ఉండాలి. దాన్ని అమలు జరపాలి. నేడు దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం అనేక కమ్యూనిస్టు పార్టీలుగా విభజించబడి ఉంది. వీటిల్లో విప్లవ పార్టీలు, పార్లమెంటరీ పార్టీలు ఉన్నాయి. అవి పంథా, కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నాయి. అమలుకు పూనుకున్నాయి. విప్లవ కమ్యూనిస్టు పార్టీలు, పార్లమెంటరీ కమ్యూనిస్టు పార్టీలకు నేటి వ్యవస్థ స్వభావం, వ్యవస్థను ఏ విధంగా మార్చాలి, పాలక వర్గాల స్వభావం గురించి భూస్వామ్య వ్యవస్థ గురించి, బడా బూర్జువా వర్గం స్వభావం గురించిన అవగాహనలో తీవ్రమైన విభేదాలు ఉన్నాయి. ఒక దానితో మరొకటి పొసగదు. భారత సామాజిక వ్యవస్థ గురించి, ఆ వ్యవస్థను మార్చడం గురించి ఒక అవగాహన లేకుండా ఐక్యత ఎలా సాధ్యం అవుతుంది. ఐక్యత కోరుకునే మిత్రులందరూ ఈ వాస్తవాన్ని గ్రహించాలి గదా! వ్యవస్థ గురించి, దాన్ని మార్చడం గురించి ఉమ్మడి అవగాహన లేకుండా ఏర్పడే ఐక్యత ఎలా నిలబడగలుగుతుంది.విప్లవ కమ్యూనిస్టు పార్టీలకు వ్యవస్థ, దాని మార్పువెడల ఒకే అవగాహన ఉంది. (కొద్ది విప్లవ పార్టీలు పాత వైఖరినుంచి వైదొలిగాయి) అనుసరించే ఎత్తుగడల్లో తేడాలు ఉన్నాయి. కొన్ని పార్టీలు అతివాద విధానాలు అనుసరించాయి. దాని నష్టాలు తీవ్రంగా ఉన్నాయి. విప్లవ పార్టీలు ఆత్మవిమర్శనా పద్ధతిలో అనుసరించిన కార్యాచరణను, వచ్చిన ఫలితాల నుంచి గుర్తించి గుణపాఠాలు తీసుకుంటే విభేదాలు తొలగిపోతాయి. విప్లవకారుల ఐక్యత గురించి మాట్లాడుతున్న విప్లవ పార్టీలు అందుకోసం ఎటువంటి బేషజాలకు, స్వీయాత్మక ఆలోచనకు లోను గాకూడదు. అలా జరిగితే విప్లవ పార్టీల మధ్య ఐక్యత సాధ్యమే. వ్యవస్థ మార్పుకు అంకితమైన విప్లవ పార్టీలు విడివిడి గాను, ఉమ్మడిగా ఇలాంటి సమీక్షకు ముందుకు రావాలి. గుణపాఠాలను విప్లవ శ్రేణులకు అందించాలి.పార్లమెంటరీ విధానాన్ని అనుసరిస్తున్న పార్టీలు సోషలిజాన్ని గురించి మాట్లాడుతున్నాయి. పార్లమెంటరీ విధానం ద్వారా సోషలిజాన్ని సాధించవచ్చని చెప్పే ఈ పార్టీలు, పార్లమెంటరీ విధానంలో కూడా స్వతంత్ర విధానాన్ని అనుసరించడం లేదు. ప్రస్తుతం అవి అనుసరిస్తున్న విధానాలు సోషల్ డెమాక్రాట్ల విధానాలుగా ఉన్నాయి. బూర్జువా పార్టీలతో ఎన్నికల పొత్తులే పార్లమెంటరీ విధానంగా ముందుకు పోతున్నాయి. అందుకు పొంతన లేని వివరణలు ఇస్తున్నాయి. ఎన్నికల ద్వారా ఏ దేశంలో కూడా వ్యవస్థ సమూలంగా మార్పు చెందలేదు. రాజ్యాంగ యంత్రాంగాన్ని ధ్వంసం చేసి నూతన రాజ్యాంగం ఏర్పడకుండా వ్యవస్థ మార్పు సాధ్యం కాదు. మహనీయుడు లెనిన్ రాజ్యాంగ యంత్రం - విప్లవం అనే తన రచనలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు.మార్క్సిజం - లెనినిజం సిద్ధాంత వెలుగులో, ఎన్నికల్లో ఎందుకు పాల్గొనాలి, ఎన్నికల్లో పాల్గొనడం ద్వారా విప్లవోద్యమం వైపు ప్రజలను సమీకరించే అన్న ఎత్తుగడలను రూపొందించుకోవాలి. ఆ విధంగా ఎన్నికల్లో పాల్గొనాలి. అందుకు భిన్నంగా కమ్యూనిస్టులు ఎన్నికల్లో పాల్గొంటే ఎటువంటి ప్రయోజనం ఉండదు. ఇప్పటి దాకా అనుసరించిన విధానాన్ని మార్క్సిజం- లెనినిజం మార్గదర్శిగా పార్లమెంటరీ పార్టీలు సమీక్ష చేసుకోవాలి. ఆ సమీక్ష గుణపాఠాలను విప్లవ శ్రేణులకు, కమ్యూనిస్టు అభిమానులకు తెలియచేయాలి. కమ్యూనిస్టు ఉద్యమంలో రెండు పరస్పర విరుద్ధమైన విభాగాలు పనిచేస్తున్నాయి. ఈ రెండు విభాగాలు తమ సిద్ధాంత వైఖరులకు కట్టుబడి ఉన్నాయి. అందువల్ల వీటి మధ్య వెంటనే ఐక్యత సాధ్యం కాదు. ఈ రెండు విభాగాల మధ్య నేటి వ్యవస్థ గురించి, విప్లవ దశ గురించి, బడా బూర్జువా గురించి ఒక ఉమ్మడి అవగాహన ఏర్పడినప్పుడే రెండు విభాగాల మధ్య ఐక్యతా అవకాశాలు ఏర్పడతాయి. ఝుఎఝాఝఅస్త్రఅండ ఝశ్రీవష్అశీఅం వివిధ కమ్యూనిస్టు సంస్థలు, తమ తమ సిద్ధాంత అవగాహనను అట్టి పెట్టుకుంటూనే, ఉమ్మడి అవగాహన ఉన్న అంశాలపై ఐక్య కార్యాచరణ కొనసాగించాలి. ఇప్పటికే కొన్ని సమస్యల వెడల ఐక్య కార్యాచరణ కొనసాగుతున్నది. ఇవి ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల మీద కొనసాగుతూ ఉంది. ఈ పరిధిని దాటాలి. వ్యవస్థ వెడల, విప్లవోద్యమం వెడల ఒక అవగాహనకు రాయడానికి దేశం లో వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్య విధానాలకు వ్యతిరేకంగా, గ్రామీణ ప్రాంతంలో పేదలకు భూపంపిణీ కోసం, ఎరువుల, విత్తనాల సబ్సిడీ పెంచాలని, కార్పొరేట్ వ్యవసాయానికి వ్యతిరేకంగా, గ్రామీణ పేదలపై భూస్వాముల, పెత్తందార్ల దాడులకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాద, బహుళజాతి సంస్థల దోపిడీకి వ్యతిరేకంగా, ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వ నిర్బంధానికి వ్యతిరేంగా ప్రజా ఉద్యమాల నిర్మాణానికి ఐక్య కార్యాచరణ కొనసాగాలి. ఈ ఐక్య కార్యాచరణ అనుభవాల ఆధారంగా భారత సామాజిక వ్యవస్థ, భారత విప్లవోద్యమ దశ గురించి, ఉమ్మడి కార్యక్రమం గురించిన అవగాహనకు రావాలి. ఇలాంటి ఐక్య కార్యాచరణే కమ్యూనిస్టుల ఐక్యతకు దారితీస్తుంది. ఇదే కమ్యూనిస్టుల ఐక్యత కోరుకునే మిత్రులు ఆలోచించాల్సిన అంశం.

# అధికారుల కనుసైగల్లో బిల్డర్ల దందా.?

- ●మున్సిపల్ అనుమతులు ఉన్న బిల్డర్లు ఎంతమంది.?
- ●మున్సిపల్ అనుమతులు లేకుండానే ఇష్టారాజ్యంగా నిర్మాణాలు
- ●2 అంతస్తులకు అనుమతులు 8 అంతస్తుల వరకు నిర్మాణాలు
- ●కోర్టు స్టేలను అడ్డుపెట్టుకుని అక్రమ అంతస్తులు
- ●నాణ్యతకు తిలోదకాలు ప్రమాదాలు జరిగినప్పుడే అధికారుల హడావుడి
- ●నాలుగు రోజుల్లో మళ్లీ అదే అక్రమ నిర్మాణాల తంతు
- ●స్థానిక ప్రజా ప్రతినిధుల, రాజకీయ నాయకుల కనుసైగల్లోనే నిర్మాణాల దందా.?
- ●అక్రమాలను వెలుగులోకి తెస్తే రిపోర్టర్లపైనే కేసులు
- ●అక్రమ నిర్మాణాలపై కథనాలు రాస్తే ఎక్స్టార్షన్ పేరుతో అక్రమ కేసులు







హైదరాబాద్, ఆగస్టు23 (నేటి దర్శిని): గ్రేటర్ హైదరాబాద్ నగరంలో అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకప్పుడు నిర్మాణ రంగంలో అనుభవం, సాంకేతిక పరిజ్ఞానం ఉన్నవారే బిల్డర్లుగా నిర్మాణాలు చేసేవాళ్లు కానీ ఇప్పుడు దారినపోయే దానయ్య కూడా బిల్డర్‌గా మారుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపట్టడం, అనుమతించిన దానికంటే అదనపు అంతస్తులు నిర్మించడం, నిబంధనలను బేఖాతరు చేయడం నగరంలో ఈ పరిస్థితి నిత్యకృత్యంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ధనార్జనే ధ్యేయంగా.. నాణ్యతకు తిలోదకాలు**

భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సి ఉండగా.. కొందరు అక్రమ బిల్డర్లు ధనార్జనే లక్ష్యంగా, ఖర్చు తగ్గించుకునేందుకు నాసిరకం సిమెంట్, డస్ట్ కలిసిన మెటీరియల్, నాణ్యత లేని ఇసుక, ఇనుము వంటి వాటిని వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనుభవం లేని మేస్త్రీలు, కార్మికులతో పనులు చేయిస్తూ నిర్మాణ వ్యయాన్ని తగ్గించుకోవడమే లక్ష్యంగా వ్యవహరించడంతో భవనాలు కూలిపోతున్నాయని పలువురు పేర్కొన్నారు. ఫలితంగా నిర్మాణంలోనే గోడలు బీటలు వారడం, స్లాబ్‌లకు సమస్యలు రావడం, కొన్నిచోట్ల నిర్మాణాలు కూలిపోవడం వంటి అనేక సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.

**ప్రజల ప్రాణాలతో చెలగాటం**

అక్రమ నిర్మాణాలు ప్రభుత్వ ఆదాయానికి భారీగా నష్టం కలిగించే అంశం మాత్రమే కాదు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిర్మాణ కార్మికులు సైతం సరైన భద్రతా చర్యలు లేకుండా పనిచేస్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కార్మికులు భవనాలపై నుండి పడి మరణించిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఆ నిర్మాణాలపై ఇప్పటివరకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆర్థిక లావాదేవీలే కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రమాదం జరిగిన ప్రతిసారీ అధికారులు హడావుడిగా తనిఖీలు, కూల్చివేతల ప్రకటనలు చేయడం.. కొద్ది రోజులకే పరిస్థితి మళ్లీ యథాతథంగా మారడం విమర్శలకు తావిస్తోంది.

**" స్టే" పేరుతో అక్రమాలకు శ్రీకారం.?**

కొన్ని నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చిన తర్వాత కోర్టులను ఆశ్రయించి మధ్యంతర ఉత్తర్వులు తెచ్చుకుని, వాటిని అడ్డుపెట్టుకుని నిర్మాణాలను కొనసాగించడం సర్వసాధారణంగా మారింది. ఆ కోర్టు స్టే ని తొలగించడానికి మున్సిపల్ అధికారులు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు కనీసం కౌంటర్ కూడా వేయని కేసులు ఎన్నో ఉన్నాయి దానికి కారణం అక్రమ నిర్మాణదారులతో టౌన్ ప్లానింగ్ అధికారులు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు కుమ్మకు కావడమే కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకోసమే ఎన్ని సంవత్సరాలు గడిచిన మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కౌంటర్ వెయ్యరు. కోర్టు ఉత్తర్వుల అసలు పరిధి, అమలు పరిస్థితులను పరిశీలించకుండా వాటిని అక్రమ నిర్మాణాలకు రక్షణ కవచంగా మార్చుకుంటే ప్రజా భద్రతకు తీవ్ర ముప్పు ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల కనుసైగల్లోనేనా.?**

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు ఫిర్యాదులు చేసిన ఎందుకు ముందస్తు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫిర్యాదులు వచ్చిన తర్వాత కూడా నిర్మాణాలు కొనసాగుతున్నాయంటే పర్యవేక్షణ వ్యవస్థ ఎక్కడ విఫలమవుతోందో చెప్పాల్సిన బాధ్యత మున్సిపల్ శాఖ మంత్రిపై, కమిషనర్లపై ఉంది. అక్రమ నిర్మాణాలకు ఎవరి అండదండలు ఉన్నాయో సమగ్రంగా విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రమాదం జరిగినప్పుడే మేల్కొంటారా.?**

అక్రమ నిర్మాణాలు కూలిన తర్వాత, కార్మికుడు ప్రాణాలు కోల్పోయిన తర్వాత లేదా ప్రజలు గాయపడిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే నిర్మాణ దశలోనే అక్రమాలను గుర్తించి అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. టౌన్ ప్లానింగ్ విభాగంలో చైన్ మెన్, సెక్షన్ ఆఫీసర్, ఏసీపీలో ప్రాథమిక దశలోనే అక్రమ నిర్మాణాలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోకుండా సెటిల్మెంట్లు చేసుకుంటున్నరన్న విమర్శలు ఉన్నాయి. ప్రమాదం జరిగిన రోజున అధికారులు రంగంలోకి దిగి హంగామా చేయడం.. నాలుగు రోజులు గడవకముందే అదే ప్రాంతంలో మరో అక్రమ నిర్మాణం యదేచ్ఛగా మొదలవుతుందన్న విమర్శలు ప్రభుత్వ యంత్రాంగం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

**అక్రమాలను ప్రశ్నిస్తే రిపోర్టర్లపైనే కేసులా.?**

ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే మీడియా కథనాలను అధికారులు స్వాగతించాల్సింది పోయి.. అక్రమ నిర్మాణాలపై వార్తలు రాసిన రిపోర్టర్లపైనే అక్రమ కేసులు పెట్టడం మరింత దురదృష్టకరమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అవినీతి, అక్రమాలపై ప్రశ్నించడం జర్నలిస్టుల బాధ్యత. నిజంగా వార్తల్లో అవాస్తవాలు ఉంటే చట్టపరమైన మార్గాల్లో సమాధానం ఇవ్వాలి తప్ప.. కేసులతో గొంతు నొక్కే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి మంచిది కాదని జర్నలిస్టు సంఘాలు పేర్కొంటున్నాయి. ఇటీవల అక్రమ నిర్మాణాలపై కథనాలు రాస్తున్న రిపోర్టర్ల పై ఒక పథకం ప్రకారం బిల్డర్లు ఎక్స్టార్షన్ పేరుతో తప్పుడు కేసులు పెట్టడం సర్వసాధారణంగా మారింది. రిపోర్టర్ల పై ఫిర్యాదులు రావడమే ఆలస్యం క్షణాలలో ఎఫ్ఐఆర్ లు నమోదవుతున్నాయి. ఫిర్యాదులపై కనీస ప్రాథమిక విచారణ జరగకుండానే అంటే బిల్డర్ల దౌర్జన్యం, ఆర్థిక బలం ఎంత తీవ్రస్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు.

**ఎవరి ప్రాణాలకు ఎవరు బాధ్యులు.?**

ప్రభుత్వం దృష్టికి అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు, మీడియా కథనాలు వస్తున్న ఎలాంటి చర్యలు లేకపోతే.. రేపు ఏదైనా భారీ ప్రమాదం జరిగితే అందుకు బాధ్యత ఎవరిది.? మున్సిపల్ అధికారులదా.? స్థానిక ప్రజాప్రతినిధులదా.? ప్రాణనష్టం జరిగిన తర్వాత పరిహారాలు ప్రకటించడం కంటే ముందుగానే ప్రమాదాలను నివారించడం ప్రభుత్వ బాధ్యత. గ్రేటర్ హైదరాబాద్‌లో ఉన్న మూడు మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల పరిధిలో అనుమతులు, నిర్మాణ నాణ్యత, అదనపు అంతస్తులు, భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇకనైన కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిచి అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతుందా.? లేక మరో ప్రమాదం జరిగే వరకు వేచి చూస్తుందా.? అన్నదే నగరవాసుల ప్రశ్న.

## ఘనంగా ఖానాపూర్ గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన

- ●పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీ నాయకులు





తలకొండపల్లి ఆగస్టు 23, (నేటి దర్శిని): తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు,
ఈ కార్యక్రమానికి.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యులు ఠాకూర్ బాలాజీ సింగ్,ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని, గ్రామం సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు,గ్రామాల్లో దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా ప్రజల ఐక్యత, భక్తి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో.. గ్రామ సర్పంచ్ అనిత శ్రీనివాస్, ఆలయ నిర్మాణ దాతలు గోకికార్ రమేష్ లతో పాటు మార్కెట్ యార్డు చైర్మన్ యాట గీత నరసింహ,పార్టీ మండల అంధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ అధ్యకులు డోకూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు బొజ్జ వెంకట్రామ్ రెడ్డి,నరసింహ,మాజీ ఎంపీటీసీ గణేష్ గుప్తా,లతో పాటు వివిధ గ్రామాల సర్పంచ్ లు,ఉప సర్పంచ్ లు,సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్‌తో పేద కుటుంబాలకు ఆర్థిక చేయూత



తలకొండపల్లి, ఆగస్టు 23, (నేటి దర్శిని): రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం లింగరావుపల్లి గ్రామానికి చెందిన బొచ్చుపల్లి పెద్ద జంగయ్యకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ. 60 వేల చెక్కును కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, లింగరావుపల్లి గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ పథకం ఎంతో అండగా నిలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని, అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలు తమ దృష్టికి వస్తే సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు భాస్కర్ రెడ్డి, పోతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, బసప్ప, శేఖర్ గౌడ్, యాదయ్య, జంగయ్య, శ్రీధర్, రబ్బానీ, శివారెడ్డి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శాఖాపురంలో ఘనంగా బోనాల పండుగ..

- ●ముత్యాలమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించిన గ్రామస్తులు





నిడమానూరు, ఆగస్టు 23 (నేటి దర్శిని): నిడమానూరు మండలంలోని శాఖాపురం గ్రామంలో బోనాల పండుగను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గత రెండు నెలలుగా గ్రామంలో విషజ్వరాల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, గ్రామస్తులు ఊరువాడ ఏకమై శ్రావణమాసం సందర్భంగా గ్రామదేవత ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేకంగా ప్రార్థించారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొనాలని, ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముత్యాలమ్మ తల్లి కరుణ చూపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చేకూరి సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ లాజర్, నల్లగంతుల నర్సింహ, ఉడుతూరి శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యుడు పోలెపల్లి యేసు తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

## ఆకుతోటపల్లి సర్పంచ్ మాతృమూర్తి ద్వాదశ దినకర్మ కార్యక్రమం

### హాజరైన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



ఆమనగల్, ఆగస్టు 23 (నేటి దర్శిని): ఆమనగల్ మండలం, ఆకుతోటపల్లి గ్రామ సర్పంచ్ న్యాలపట్ల నరేందర్ రెడ్డి మాతృమూర్తి స్వర్గీయ భారతమ్మ ద్వాదశ దినకర్మ కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టి ఏ ఎస్ కె- సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరయ్యారు... ఈ సందర్భంగా స్వర్గీయ భారతమ్మ చిత్రపటానికి నివాళులర్పించి స్వర్గీయ భారతమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో.. కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఓబిసి జనగామ జిల్లా ఉపాధ్యక్షుడి గా దేవరకొండవిష్ణు వర్ధన్ చారి




**తొర్రూర్ ,ఆగస్టు 23: (నేటి దర్శిని):** తొర్రూరు మండలంలోని గుర్తురు గ్రామానికి చెందిన బిజెపి నాయకులు దేవరకొండవిష్ణు వర్ధన్ చారి నీ బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గా నియమించి నట్లు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు వడ్లకొండ రవి ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా ఓబీసీ జిల్లా నూతన ఉపాధ్యక్షులు దేవరకొండ విష్ణువర్ధన్ చారి మాట్లాడుతూ బిజెపి పార్టీ కోసం తాను చేస్తున్న సేవలను గుర్తించి జిల్లా పదవి అప్పగించడం చాలా ఆనందంగా ఉందన్నారు తనకు ఈ పదవి రావడానికి కృషిచేసిన బిజెపి జనగామ జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్ కు రాష్ట్ర నాయకులు పాలకుర్తి ఇంచార్జ్ లేగారామ్మోహన్ రెడ్డి ఓబీసీ జిల్లా అధ్యక్షులు వడ్లకొండ రవి ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొలుపుల శంకర్ జనగామ జిల్లా ఉపాధ్యక్షులు రంగు రాములు గౌడ్ పల్లె కుమార్ తొర్రూర్ రూరల్ అధ్యక్షులు గట్టు రాంబాబు అర్బన్ అధ్యక్షులు పైండ్ల రాజేష్ మరియు బిజెపి జిల్లా మండల గ్రామ నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు తనకు అప్పగించిన పదవిని వమ్ము చేయకుండా బీజేపీ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు

# మునుగోడులో కోతుల బెడద..

- ప్రజలకు తప్పని ఇబ్బందులు



**మునుగోడు ఆగస్టు 23 (నేటి దర్శిని):** మునుగోడు పట్టణంలో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. గుడికి వెళ్లినా, పాఠశాలకు వెళ్లినా, మార్కెట్‌కు వెళ్లినా కోతుల గుంపులు ఎదురవుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, మహిళలు కోతుల కారణంగా భయాందోళనకు గురవుతున్నారు. చేతుల్లో ఆహార పదార్థాలు, కూరగాయల సంచులు ఉంటే వాటిని లాక్కోవడానికి ప్రయత్నించడంతో పాటు, కొన్ని సందర్భాల్లో ప్రజల మీదికి దూకుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

పాఠశాలలు, ఆలయాలు, మార్కెట్ల పరిసరాల్లో కోతుల సంచారం ఎక్కువగా ఉండటంతో చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కోతుల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. ప్రజలు కోతులను రెచ్చగొట్టకుండా, హింసించకుండా అధికారులకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు.

ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే.. ముందుగానే చర్యలు చేపట్టి మునుగోడు ప్రజలకు కోతుల బెడద నుంచి విముక్తి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

## సురిగి బిక్షమయ్య గౌడ్ సురిగి పెద్దమ్మ కుమారుడు వెంకటేష్ దివ్యశ్రీ వివాహంలో పాల్గొన్న సురిగి నరసింహ గౌడ్..



**చిట్యాల న్యూస్ ఆగస్టు 23.. (నేటి దర్శిని):** ఈరోజు కృష్ణాపురం వాస్తవ్యులు శ్రీ సూరిగీ భిక్షం గౌడసురిగి పెద్దమ్మ పెద్ద కుమారుడు వెంకటేష్ గౌడు దివ్యశ్రీవివాహం చిట్యాల B.R ఫంక్షన్ హాల్లో జరిగే వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించిన మునుగోడుకాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సురిగీ నరసింహ గౌడ్. ఈ కార్యక్రమంలో కందుల రవికుమార్ గౌడ్ సూ రిగీ మైసూర్ గౌడ్ సూరి లింగస్వామి సురవి రమేష్ సాయి గౌడ్ నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది

# తెలంగాణ ముదిరాజ్ జర్నలిస్టు సంఘం రాష్ట్ర కార్యవర్గ ముఖ్యుల సమావేశం

- సికింద్రాబాద్ బోయగూడా ముదిరాజ్ భవన్ లో తెలంగాణ ముదిరాజ్ జర్నలిస్టు సంఘం ఆత్మీయ సమ్మేళనం
- హైదరాబాద్ జిల్లా కన్వీనర్ గా బాపట్ల కృష్ణమోహన్ ముదిరాజ్, కో కన్వీనర్ గా గడ్డమీద శ్రీశైలం ముదిరాజ్



**సికింద్రాబాద్,ఆగస్టు23 (నేటి దర్శిని):** తెలంగాణ ముదిరాజు జర్నలిస్టు సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చింతల నీలకంఠం, బోయిని శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి 33 జిల్లాల అధ్యక్షులను ఎన్నుకోవడం కొరకు ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలుగా ఉన్నటువంటి 10 జిల్లాల కన్వీనర్లను ఆదివారం ఎన్నుకోవడం జరిగింది. ఉమ్మడి జిల్లా కన్వీనర్లు గా ఉన్నటువంటి వారు ఉమ్మడి జిల్లాలో ఏ జిల్లా కొత్త జిల్లాలుగా ఏర్పడినావో ఆ జిల్లాలకు అధ్యక్షుల నియామకం జరిగే క్రమంలో వారి బాధ్యతను నిర్వహించడానికి ప్రస్తుతం కన్వీనర్లను నియమించడం జరిగింది. హైదరాబాద్ జిల్లా కన్వీనర్ గా బాపట్ల కృష్ణమోహన్ ముదిరాజ్, కో కన్వీనర్ గా గడ్డమీద శ్రీశైలం ముదిరాజ్ ను నియమించారు. అలాగే ఉమ్మడి మహబూబ్నగర్ కన్వీనర్ గా జి .నర్సింలు ముదిరాజ్, నారాయణపేట జిల్లా కన్వీనర్ గా నవీన్ ముదిరాజ్, సిద్దిపేట జిల్లా కన్వీనర్ గా పరమేశ్వర ముదిరాజ్, కో కన్వీనర్ గా బరిగే నర్సింలు ముదిరాజ్, నిర్మల్ జిల్లా కన్వీనర్ గా హనుమాన్లు ముదిరాజ్, సంగారెడ్డి జిల్లా కన్వీనర్ గా ఏ. రాంబాబు మరియు కో కన్వీనర్ గా గోవర్ధన్ ముదిరాజ్, మెదక్ జిల్లా కన్వీనర్ గా వెంకటేశం ముదిరాజ్, కరీంనగర్ జిల్లా నేదురు సమ్మయ్య ముదిరాజ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల్ సుమన్ ముదిరాజ్, నల్గొండ జిల్లా కన్వీనర్ గా సైదులు ముదిరాజ్ లను నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాల నుండి వచ్చినటువంటి ముదిరాజులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటిన గాంధీ

**రంగారెడ్డి జిల్లా ఆగస్ట్ 23 (నేటి దర్శిని):** మియాపూర్ డివిజన్ పరిధిలోని జనచైతన్య కాలనీ లో సీఎంసీ విభాగం వారి ఆధ్వర్యంలో జరిగిన వన మహోత్సవం కార్యక్రమంలో సీఎంసీ అదనపు కమిషనర్ సుభద్ర దేవి, డీసీ రీ శ్రీనివాస్, తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ జనచైతన్య కాలనీ వారు ఇతర కాలనీల కు ఆదర్శంగా నిలిచారు అని, మొక్కలు నాటి హరిత వనం గా విరాజిల్లలనీ ,ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యత గా మొక్కలు నాటాలని , మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని,మానవాళి మనుగడకు మొక్కే శ్రీరామ రక్ష అని, సమస్త జీవ కోటికి ప్రాణధారం మొక్కలు అని,అడవుల శాతం పెంచే లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి–వాటిని కాపాడాలిఅని, ,కరోన వంటి విపత్కర పరిస్థితుల్లో ఆక్సిజన్ అవసరం గూర్చి ప్రతి ఒక్కరికి తెలుసునని కావున దీనిని అధిగమించడానికి ప్రతి ఒక్కరు మొక్కలు తప్పనిసరిగా నాటాలని , మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలియచేసారు. యూబిడి విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని అభినందించారు. నాటిన మొక్కలను సంరక్షిస్తూ, కాలనీలో పచ్చదనాన్ని మరింత పెంచేందుకు కాలనీ వాసులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



మారేడు, వెలగ, జమ్మి వంటి స్థానిక జాతులతో పాటు రుద్రాక్ష, గంధపు చెట్టు, ఎర్రచందనం వంటి పవిత్రమైన మొక్కలకు పర్యావరణ, ఔషధ మరియు ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని తెలిపారు. ఇటువంటి మొక్కలను పెద్ద ఎత్తున నాటడం ద్వారా జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ మరియు పచ్చదనం మెరుగుపడతాయని , పచ్చదనాన్ని పరిరక్షించడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, ఆరోగ్యకరమైన మరియు సుస్థిరమైన పట్టణ వాతావరణాన్ని అభివృద్ధి చేయడానికి ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించాలని తెలియచేశారు అదేవిధంగా ఖాళీ స్థలాలు,రోడ్లకు ఇరువైపులా, అన్ని రకాల అనువైన ప్రదేశాలను గుర్తించి మొక్కలు నాటాలి అని , నాటిన మొక్కలను తప్పనిసరిగా సంరక్షించాలని, మొక్కలు నాటడమే కాదు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత కూడా మనదే అని,మొక్కలను చిన్న పిల్లలు పెంచినట్టు పెంచాలని, పిల్లలు, మహిళలు, యువకులు వృద్ధులను మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయడం చాలా అభినందనీయం అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు సతీష్ బాబు, విక్రమ్ చంద్ర, నాయలు ప్రతాప్ రెడ్డి మరియు జనచైతన్య కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు,ఇగ్నైట్ కలశాల కు చెందిన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి




- తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ డిమాండ్

**హైదరాబాద్, ఆగస్ట్ 23 (నేటి దర్శిని):** పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్(టీజీహెచ్ఎంఏ) డిమాండ్ చేసింది. ఆదివారం టీజీహెచ్ఎంఏ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 2025 ఆగస్టు 21న జీహెచ్ఎం ప్రమోషన్లు పొందిన పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజీహెచ్ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ నజీముద్దీన్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న చర్యలను అభినందించారు. ఒకే కలం పోటుతో 32 వేల ప్రమోషన్లు కల్పించడం, పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించడం, ఒకే సంవత్సరంలో రెండుసార్లు జీహెచ్ఎం ప్రమోషన్లు ఇవ్వడం విద్యాశాఖలో ముఖ్యమంత్రి తీసుకున్న కీలక నిర్ణయాలని నజీముద్దీన్ పేర్కొన్నారు. అయితే ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు సంబంధించిన పలు సమస్యలు ఇంకా పరిష్కారం కావాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రెండో పీఆర్సీ నివేదికను ఎలాంటి జాప్యం లేకుండా అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను ఏకకాలంలో ప్రకటించాలని కోరారు. 2003 డీఎస్సీ ఉద్యోగులను సీపీఎస్ నుంచి ఓపీఎస్‌లోకి తక్షణమే మార్చాలని, పాఠశాలల పర్యవేక్షణకు ప్రతి మండలానికి ఇద్దరు ఎంఈఓలను నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 750 జీహెచ్ఎం పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయడంతో పాటు, అప్‌గ్రేడ్ అయిన 267 పాఠశాలల్లో జీహెచ్ఎం ప్రమోషన్లకు అవకాశం కల్పించాలని కోరారు. టెట్ అర్హత మార్కులను తగ్గించాలని, ఈహెచ్ఎస్‌ను త్వరితగతిన అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు, ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఏరియర్స్ కోసం నెలకు రూ.2,000 కోట్లు కేటాయించాలని కోరారు. అదేవిధంగా తెలంగాణలోని అన్ని పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేయాలని నజీముద్దీన్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో 33 జిల్లాల గెస్ట్ ప్రధానోపాధ్యాయులతో పాటు టీజీహెచ్ఎంఏ సంఘ సభ్యులు, జిల్లా, రాష్ట్ర బాధ్యులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, భూక్య శ్రీనునాయక్, జాకా వెంకటేశం, వేణుగోపాల్, రవీందర్, ఈరన్న, కమలాదేవి, తడక రాజు, బుధదేవ్, ప్రదీప్ కుమార్ తదితర జీహెచ్ఎంలు పాల్గొన్నారు.

# బిజినెస్

## సామాన్యులకు బిగ్ షాక్.. నిత్యావసరాల ధరలకు రెక్కలు



మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం మరింత పెరుగుతోంది. బియ్యం, పంచదార, వంట నూనె, పప్పులు, ఉల్లిపాయలు తదితర వస్తువుల ధరలు భారీగా పెరగడంతో కుటుంబ బడ్జెట్‌లు తారుమారవుతున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బియ్యం ధర కిలోకు రూ. 10 మేర పెరగగా, పంచదార కిలో రూ. 64కు చేరినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. వంట నూనె లీటర్ ధర రూ. 180కు చేరడంతో మధ్యతరగతి, పేద కుటుంబాలపై అదనపు భారం పడుతోంది. మరోవైపు ఉల్లిపాయల ధర కిలోకు రూ. 70కు చేరడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. పప్పులు, ఇతర నిత్యావసర సరుకుల ధరలు కూడా పెరుగుతున్నాయని చెబుతున్నారు. ధరల పెరుగుదలకు ఎల్‌నినో ప్రభావాన్ని కారణంగా చూపుతూ కొందరు వ్యాపారులు సరుకులను నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో మార్కెట్‌లో సరఫరా తగ్గి ధరలు మరింత పెరుగుతున్నాయని వినియోగదారులు అంటున్నారు. నిత్యావసర సరుకుల ధరలను అదుపులోకి తీసుకురావడంతో పాటు అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌పై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే పెరుగుతున్న జీవన వ్యయాలతో ఇబ్బందులు పడుతున్న సామాన్యులకు నిత్యావసరాల ధరల పెరుగుదల మరింత భారంగా మారుతోంది. ప్రభుత్వం మార్కెట్‌పై నిఘా పెంచి, ధరల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## బంగారం, వెండి ధరలకు మరింత రెక్కలు



పసిడి ధరలు ఇటీవల కాలంలో భారీగా పెరుగుతున్నాయి. వెండి ధరలు సైతం అదే స్థాయిలో దూసుకెళ్తుండటం వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తోంది. అయితే రానున్న నెలల్లో బంగారం, వెండి ధరలు మరింత పెరిగే అవకాశముందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం బంగారం ధరలు మరో 30 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. ఇక వెండి ధరలు ప్రస్తుత స్థాయితో పోలిస్తే లిలిరెట్టింపు అయ్యే అవకాశముందనిలిలి అంచనాలు వెలువడుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొంటున్న ధరల హెచ్చుతగ్గులు, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గడం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న ఆర్థిక నిర్ణయాలు వంటి అంశాలు విలువైన లోహాల ధరలపై ప్రభావం చూపుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి పెరుగుతున్న సమయంలో పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడిగా బంగారం, వెండి వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో వీటికి డిమాండ్ పెరిగి ధరలు కూడా పైపైకి కదులుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఇక ఈ వారం మార్కెట్లోనూ బంగారం, వెండి ధరలు గణనీయంగా పెరిగాయి. బంగారం ధర సుమారు లిలి5 శాతంలిలి, వెండి ధర లిలి6 శాతంలిలి మేర పెరిగినట్లు మార్కెట్ గణాంకాలు సూచిస్తున్నాయి. అంతర్జాతీయ పరిస్థితులు, పెట్టుబడిదారుల డిమాండ్, కరెన్సీ మార్పులు వంటి అంశాలపై ఆధారపడి రానున్న రోజుల్లో ధరల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకునే వారు ప్రస్తుత పరిస్థితులను నిశితంగా గమనించాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. అయితే భవిష్యత్ ధరలపై అంచనాలు మారే అవకాశం ఉన్నందున పెట్టుబడిదారులు మార్కెట్ పరిస్థితులను పరిశీలించి నిర్ణయం తీసుకోవడం మంచిదని చెబుతున్నారు.

## భారత్‌లో గోల్డ్ లోన్లకు పెరుగుతున్న డిమాండ్.. ఇండియన్ బ్యాంక్ ప్రత్యేక దృష్టి

బంగారం ధరలు పెరుగుతుండటంతో దేశంలో గోల్డ్ లోన్లకు డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగ ఇండియన్ బ్యాంక్ గోల్డ్ లోన్ విభాగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రస్తుతం రూ. 1.25 లక్షల కోట్లుగా ఉన్న తమ గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియో ఈ ఆర్థిక సంవత్సరంలో 20 శాతం వృద్ధితో రూ. 1.5 లక్షల కోట్లను దాటుతుందని బ్యాంక్ ఎండీ, సీఈఓ బినోద్ కుమార్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగం 30 శాతం వృద్ధి సాధించింది. వ్యక్తిగత అవసరాలతో పాటు చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి, ఇతర ఆర్థిక అవసరాలకు గోల్డ్ లోన్లు ఉపయోగపడుతున్నాయని ఆయన చెప్పారు. బంగారం ధరలు పెరగడం కూడా రుణ విలువ పెరగడానికి కారణమవుతోందని వివరించారు.



# స్పోర్ట్స్

## వరుసగా రెండో మ్యాచ్‌లోనూ పడిక్కల్ సెంచరీ..

- ఏడేళ్ల తర్వాత అరుదైన రికార్డు..!
- శ్రీలంక పర్యటనలో పడిక్కల్ రెండో సెంచరీ
- కొలంబో టెస్టులోనూ శతక్కొట్టిన బ్యాటర్
- భారీ స్కోరు దిశగా అడుగులేస్తున్న భారత్




శ్రీలంక పర్యటనలో భారత యంగ్ సెన్సేషన్ దేవదత్ పడిక్కల్ తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. వరుసగా రెండో టెస్ట్ సెంచరీతో చెలరేగిపోయాడు. కొలంబో వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడిన పడిక్కల్, మైదానంలో నలువైపులా క్లాసికల్ షాట్లతో లంక బౌలర్లకు చుక్కలు చూపించాడు. గాలే వేదికగా జరిగిన తొలి టెస్టులో సెంచరీ సాధించి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన పడిక్కల్, ఇప్పుడు కొలంబో వేదికగా జరిగిన రెండో టెస్టులోనూ శతకంతో కదం తొక్కాడు. ఈ మ్యాచులో టాస్ గెలిచిన భారత్.. తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. కేఎల్ రాహుల్ ఔట్ అయ్యాక క్రీజులోకి వచ్చిన పడిక్కల్.. లంక బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. ఆచితూచి ఆడుతూనే.. వీలు చిక్కనప్పుడల్లా బంతిని బౌండరీకి తరలించాడు. ఈ క్రమంలోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత వేగంగా ఆడేందుకు ప్రయత్నించిన పడిక్కల్.. 193 బంతుల్లో 117 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. ఈ ఇన్నింగ్స్‌లో అతడు 12 ఫోర్లు కొట్టాడు. కాగా టెస్టుల్లో ఎంతో కీలకమైన మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి వరుసగా రెండు ఇన్నింగ్స్‌లలోనూ సెంచరీలు సాధించడంతో పడిక్కల్ టీమిండియా టెస్ట్ జట్టులో తన స్థానాన్ని దాదాపు ఖాయం చేసుకున్నట్లే కనిపిస్తోంది. రాహుల్ ద్రవిడ్, ఛతేశ్వర్ పూజారా వంటి దిగ్గజాలు ఏలిన నంబర్-3 పొజిషన్‌లో ప్రస్తుతం పడిక్కల్ చూపిస్తున్న నిలకడ యాజమాన్యానికి కొండంత భరోసానిస్తోంది. ఇక పడిక్కల్ సెంచరీతో ఒక అరుదైన రికార్డు సాధించాడు. విదేశీ పర్యటనల్లో ఏడేళ్ల తర్వాత భారత్ తరఫున నంబర్-3 స్థానంలో వరుసగా రెండు టెస్టుల్లో సెంచరీలు బాదిన బ్యాటర్‌గా నిలిచాడు. 2018/19 బార్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియా గడ్డపై పూజారా మెల్‌బోర్న్ వేదికగా (106), ఆ తర్వాత సిడ్నీలో (193) వరుసగా సెంచరీలు సాధించాడు. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత పడిక్కల్ ఆ అరుదైన ఘనతను పునరావృతం చేశాడు. పడిక్కల్ రాణించడంతో రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ భారీ స్కోరు దిశగా అడుగులు వేస్తోంది.

## కొలంబో టెస్టులో మైదానంలో గొడవ..

### జైస్వాల్ వికెట్ తీసి ఫెర్నాండో రెచ్చగొట్టే సెలబ్రేషన్స్
### బౌలర్ వైపు దూసుకెళ్లిన భారత బ్యాటర్



భారత్, శ్రీలంక మధ్య కొలంబోలోని ఎస్ఎస్‌సీ మైదానంలో ప్రారంభమైన రెండో టెస్టు తొలి రోజే మైదానంలో ఆటగాళ్ల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. టాస్ గెలిచి తొలి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియాకు ఓపెనర్ యశస్వి జైస్వాల్ దూకుడుగా ఆడి, శుభారంభం అందించాడు. మైదానంలో నలువైపులా షాట్లు కొడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. 53 బంతుల్లో 45 పరుగులు చేసి ప్రమాదకరంగా మారుతున్న జైస్వాల్‌ను లంక పేసర్ అసింత ఫెర్నాండో ఔట్ చేసిన తర్వాత మైదానంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇన్నింగ్స్ 17వ ఓవర్ వేసిన అసింత ఫెర్నాండో ఓవర్‌లో జైస్వాల్ వరుసగా మూడు ఫోర్లు బాదాడు. అయితే ఆ ఓవర్ చివరి బంతికి (16.6) ఇన్ స్వింగర్ డెలివరీతో జైస్వాల్‌ను బౌల్డ్ చేసిన ఫెర్నాండో, ఆవేశంతో మైదానంలో సెలబ్రేషన్స్ చేసుకున్నాడు. వికెట్ పడగొట్టిన ఆనందంలో జైస్వాల్ ముందుకు వచ్చి నోటికి పనిచెప్తూ అనుచితంగా ప్రవర్తించాడు. తొలుత డ్రెస్సింగ్ రూమ్ వైపు నడిచిన జైస్వాల్, ఫెర్నాండో మాటలకు చిర్రెత్తుకొచ్చి వెనక్కి తిరిగాడు. వెనక్కి తిరిగిన జైస్వాల్ నేరుగా ఫెర్నాండో వైపు దూసుకెళ్లాడు. ఇద్దరూ ఒకరికొకరు అత్యంత సమీపంగా వచ్చి, తీవ్రంగా వాగ్వాదానికి దిగారు. పరిస్థితి చేయిదాటేలా కనిపించడంతో శ్రీలంక కెప్టెన్ ధనంజయ డిసిల్వా వెంటనే రంగంలోకి దిగి జైస్వాల్‌ను పక్కకు తీసుకెళ్లాడు. బౌలర్ ఫెర్నాండోను కూడా వెనక్కి పంపడంతో వివాదం ముగిసింది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా ఈ సిరీస్‌లో భాగంగా గాలే టెస్టులో భారత్ ఘన విజయం సాధించింది. దీంతో 1-0తో ఆధిక్యంలో నిలిచింది. ఈ టెస్టులోనూ టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగి ఆధిపత్యం కొనసాగిస్తోంది.

## రెండో టెస్టులో ఆస్ట్రేలియా గ్రాండ్ విక్టరీ

### బంగ్లాపై ఇన్నింగ్స్ 51 పరుగుల విజయం
### తొలి టెస్ట్ ఓటమికి ప్రతీకారం తీర్చుకున్న ఆసీస్



ఆస్ట్రేలియా పర్యటనలో తొలి టెస్టును గెలిచి సంచలనం సృష్టించిన బంగ్లాదేశ్‌కు రెండో టెస్టులో కంగారూ జట్టు గట్టి షాక్ ఇచ్చింది. మ్యాకే వేదికగా జరిగిన రెండో టెస్టులో ఆస్ట్రేలియా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో విజృంభించి ఇన్నింగ్స్ 51 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో తొలి మ్యాచ్ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవడమే కాకుండా, రెండు టెస్టుల సిరీస్‌ను 1-1తో సమం చేసి తమ పరువు నిలబెట్టుకుంది ఆస్ట్రేలియా. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా బౌలర్లు మ్యాచ్ ఆరంభం నుంచే బంగ్లాపై విరుచుకుపడ్డారు. స్టార్ స్పీడ్‌స్టర్ మిచెల్ స్టార్క్ సంచలన బౌలింగ్‌తో బంగ్లాదేశ్ బ్యాటింగ్ ఆర్డర్ వెన్ను విరిచాడు. ఆసీస్ బౌలర్ల ధాటికి తాళలేక బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 64 పరుగులకే కుప్పకూలింది. మొదటి రోజు ఆటలోనే ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే పరిమితం చేయడంతో ఆస్ట్రేలియా మ్యాచ్‌పై సంపూర్ణ ఆధిపత్యాన్ని సాధించింది. అనంతరం తమ తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా, బంగ్లా బౌలర్ షోరిఫుల్ ఇస్లామ్ ధాటికి కొన్ని వికెట్లు కోల్పోయినప్పటికీ 210 పరుగులు సాధించింది. దీంతో 146 పరుగుల విలువైన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని సంపాదించింది. ఆసీస్ బ్యాటింగ్‌లో కామెరూన్ గ్రీన్ కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టును గౌరవప్రదమైన స్కోరుకు చేర్చాడు. గ్రీన్ 67 పరుగులు చేశాడు. చివర్లో నాథన్ లైయాన్ 32 పరుగులు చేసి.. జట్టు స్కోరును 200 మార్కు దాటించాడు. 146 పరుగుల భారీ వెనుకంజతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్‌కు ఆస్ట్రేలియన్ బౌలర్లు మళ్లీ చుక్కలు చూపించారు. ఈసారి కూడా క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ఒత్తిడి పెంచడంతో బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 95 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 51 పరుగుల భారీ విజయంతో రివేంజ్ తీర్చుకుని సిరీస్‌ను ముగించింది. మిచెల్ స్టార్క్ రెండో ఇన్నింగ్స్‌లోనూ నాలుగు వికెట్లు తీశాడు. మొత్తంగా ఈ టెస్టులో పది వికెట్లు పడగొట్టాడు. ఈ టెస్టు మ్యాచ్ కేవలం రెండు రోజుల వ్యవధిలో ముగిసిపోవడం గమనార్హ



## నిధి అగర్వాల్ అందాల జాతర..

# రిబాక్సాఫీస్ వద్ద ఢీలా..

### ఓటీటీలో లక్ పరీక్షించుకోనున్న అలియాభట్ 'అల్ఫా'




ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న భామల్లో టాప్‌లో ఉంటుంది అలియా భట్. ఈ భామ నటించిన తొలి ఫీ మేల్ ఓరియెంటెడ్ స్పై యాక్షన్ థ్రిల్లర్ అల్ఫా . యశ్ రాజ్ ఫిలింస్ స్పై యూనివర్స్‌లో తెరకెక్కిన ఈ చిత్రాన్ని శివ్ రావైల్ డైరెక్ట్ చేశాడు. యశ్ రాజ్ ఫిలింస్ లాంటి అగ్ర నిర్మాణ సంస్థలో వచ్చినప్పటికీ బాక్సాఫీస్ వద్ద మూవీ లవర్స్‌ను నిరాశపరిచింది. కాగా ఇక ఓటీటీలో తన లక్‌నుపరీక్షించుకునేందుకు రెడీ అయింది.అల్ఫా ఆగస్టు 28 నుంచి పాపులర్ ఓటీటీ ప్లాట్ ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ప్రస్తుతానికి ఒరిజినల్ హిందీ వెర్షన్ స్ట్రీమింగ్ కానున్నట్టు తెలుస్తుండగా.. డబ్‌డ్ వెర్షన్లకు సంబంధించిన అప్‌డేట్ రావాల్సి ఉంది. శార్వరి మరో లీడ్ రోల్‌లో నటించిన ఈ మూవీలో అనే కామియో రోల్‌లో హృతిక్ రోషన్ కబీర్ నటించాడు. బాబీ డియోలక్ష, అనిల్ కపూర్ ఇతక కీలక పాత్రలు పోషించారు. భారీ అంచనాల మధ్య విడుదలై బాక్సాఫీస్ వద్ద ఢీలా పడిపోయిన అల్ఫా మరి ఓటీటీలో ఎలాంటి స్పందన రాబట్టుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# బ్లాక్ కాస్ట్యూమ్స్‌లో తృప్తి డిమ్రి హొయలు..

### - టాక్ ఆఫ్ ది టౌన్‌గా కొత్త కలెక్షన్



పాపులర్ ఫ్యాషన్ యాక్సెసరీస్ బ్రాండ్‌కు యానిమల్ భామ తృప్తి డిమ్రి తొలి బ్రాండ్ అంబాసిడర్‌గా నియామకమైన విషయం తెలిసిందే. ఈ బ్రాండ్ రీసెంట్‌గా ఇప్పుడు ఇండియాలో సరికొత్త ఐకానిక్ సెక్సీ కలెక్షన్స్‌ను లాంచ్ చేసి నూతన అధ్యాయాన్ని ప్రారంభించింది. ఈ క్యాంపెయిన్ కోసం బ్లాక్ కాస్ట్యూమ్స్‌లో మెరిసింది తృప్తి డిమ్రి. బ్లాక్ స్టైలిష్ కాస్ట్యూమ్స్‌లో డైమండ్ జ్యువెలరీ, సాఫ్ట్ వేవ్స్, రేడియేటింగ్ బోల్డ్ అవతార్‌లో గ్లామరస్‌గా కనిపిస్తూ కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది.ఢిల్లీలోని ఆంబియెన్స్ మాల్స్ విక్టోరియా సీక్రెట్ వద్ద కొత్త కలెక్షన్ లాంచ్ చేశారు. సెక్సీ కలెక్షన్లు ఎప్పుడూ కూడా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే స్వయం వ్యక్తీకరణను మరింత పెంపొందించే విధంగా చేస్తాయని తృప్తి డిమ్రి చెప్పుకొచ్చింది. తృప్తి డిమ్రి ఈ ఏడాది ఓ రోమియో, మా బెహన్ సినిమాల్లో మెరిసింది. ప్రస్తుతం సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్‌లో ప్రభాస్ నటిస్తోన్న స్పిరిట్‌లో ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

# బన్నీ స్టైల్ కాపీ కొట్టా

ప్రేమలు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన మలయాళీ బ్యూటీ మమిత బైజూ. వరుస అవకాశాలు అందుకుంటూ సక్సెస్ రేస్‌లో దూసుకుపోతున్నది. తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో యూత్‌ని ఫిదా చేసిన ఈ అమ్మడు నటించిన డ్యూడ్, జననాయగన్ సినిమాలు బాక్సాఫీస్ దగ్గర మంచి కలెక్షన్లు రాబట్టాయి. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ సూర్యతో కలిసి 'విశ్వనాథ్ అండ్ సన్స్'లో నటించింది. ఈ సందర్భంగా అమ్మకుట్టి పంచుకున్న కార్‌వాన్ కబుర్లివి...మాది కేరళంలోని కొట్టాయం. నాన్న డాక్టర్. అన్నయ్య రాష్ట్రస్థాయి క్రికెటర్. నా జీవితంలో ముఖ్యమైన నిర్ణయాలన్నీ మా అన్నయ్యే తీసుకుంటాడు. నాకొచ్చే లవ్ ప్రపోజల్స్‌ను డీల్ చేయడంతో పాటు నాకొచ్చే పెండ్లి సంబంధాల్లోనూ ఆయన నిర్ణయమే ఫైనల్. నా తొలి సినిమా 'సర్వోపరి పాలక్కారన్' అయినా, నాకంటూ గుర్తింపు తెచ్చింది మాత్రం ప్రేమలు చిత్రమే. దాదాపు రూ.100 కోట్లకు పైగా వసూళ్లను సాధించడంతో పాటు నా కెరీర్‌ని మలుపు తిప్పిన సినిమా ఇది. మలయాళి సినిమానే అయినా ఎక్కువ భాగం షూటింగ్ హైదరాబాద్‌లోనే చిత్రీకరించారు. అందుకే తెలుగు ప్రేక్షకులు దీన్ని ఎంతో ఆదరించారు. నేను అల్లు అర్జున్‌కు పెద్ద ఫ్యాన్‌ని. ఆయన నటించిన ఇద్దరమ్మాయిలు సినిమా అంటే నాకెంతో ఇష్టం. ఆ సినిమాలో బన్నీ ఉపయోగించిన వాచ్, ధరించిన టీషర్ట్స్, ఆయన్నైస్టైల్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆయన మీదున్న అభిమానంతో ఆ స్టైల్‌ను కాపీ చేస్తుంటాను. ఇక కర సినిమా కోసం ధనుష్ ఎంతో కష్టపడ్డాడు. స్టార్ హీరో సూర్యతో కలిసి ప్రధాన పాత్రలో నటించడం గొప్ప అవకాశంగా భావిస్తాను. సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడితనం ఎక్కువైపోయింది. సెలెబ్రిటీ అనే కారణంతో నేను అడపాదడపాగా సోషల్‌మీడియాలో ఉండేదాన్ని. ప్రస్తుతం సోషల్‌మీడియాతో వచ్చే పబ్లిసిటీ కంటే మానసిక ప్రశాంతతకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. అది ఆచరణలో పెడుతున్నాను కూడా. ఇక నా సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్‌ను ఎప్పటికప్పుడు మా పీఆర్ టీమ్ అందిస్తారు. ఒక్క సినిమా వెనుక ఎంతోమంది కష్టం దాగుంటుంది. అది ఎప్పుడూ వృథా కాకూడదన్నది నా భావన. జన నాయగన్ లీకైన విషయం తొలుత నమ్మలేదు. సోషల్ మీడియాలో వినిపించేవన్నీ వాస్తవాలు కావని కొట్టిపారేశాను. ఉద్దేశపూర్వకంగా కొందరు ప్రచారం చేస్తున్నారనుకున్నా. కానీ, దురదృష్టవశాత్తు అదే నిజమైంది.



# అర్జున్ దాస్, అదితి శంకర్ 'వన్స్ మోర్' ట్రైలర్ విడుదల!




ప్రేమలో విఫలమై మనసు మార్చుకున్న రగ్డ్ హీరో, ఆయన చుట్టూ తిరిగే సరికొత్త భావోద్వేగాల కథతో తెరకెక్కిన చిత్రం 'వన్స్ మోర్' . విఘ్నేష్ శ్రీకాంత్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో అర్జున్ దాస్ సరసన అదితి శంకర్ కథానాయకిగా నటిస్తోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా అర్జున్ దాస్ ఈ చిత్రంలో చాలా సాఫ్ట్ అండ్ లవబుల్ పాత్రలో కనిపిస్తుండగా, ఆయన జీవితంలోకి ఎంట్రీ ఇచ్చి అల్లరి చేసే ఉత్సాహభరితమైన యువతిగా అదితి శంకర్ అదరగొట్టింది.గతం తాలూకు జ్ఞాపకాలు, ప్రేమలో ఎదురైన గాయాల నుంచి కోలుకోవడం , మరియు జీవితంలో దొరికే రెండో అవకాశం అనే అంశాల చుట్టూ ఈ కథ నడుస్తుందని ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ చిత్రానికి 'హృదయం', 'ఖుషి' వంటి మ్యూజికల్ హిట్స్ అందించిన హెషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తుండగా, ఇప్పటికే విడుదలైన పాటలు సోషల్ మీడియాలో విశేష స్పందనను రాబట్టాయి. మిలియన్ డాలర్ స్టూడియోస్ బ్యానర్‌పై యువరాజ్ గణేషన్ నిర్మిస్తున్న ఈ రొమాంటిక్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా ఆగస్ట్ 28న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# టాలీవుడ్‌లో మరోసారి థియేటర్ల వార్..

### 'టాక్సిక్' ఎంట్రీతో ఇబ్బందుల్లో తెలుగు సినిమాలు!




తెలుగు చిత్ర పరిశ్రమలో థియేటర్ల కేటాయింపుల వివాదం మరోసారి తీవ్రరూపం దాల్చింది. బాక్సాఫీస్ వద్ద స్ట్రెట్ తెలుగు మరియు డబ్బింగ్ చిత్రాలు ప్రదర్శితమవుతున్న వేళ, పాన్-ఇండియా స్థాయిలో రాబోతున్న భారీ బడ్జెట్ డబ్బింగ్ సినిమా 'టాక్సిక్' ఎంట్రీతో సమీకరణాలు పూర్తిగా మారిపోతున్నాయి. రాకింగ్ స్టార్ యష్ హీరోగా గీతు మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉండటంతో, ఎగ్జిబిటర్లు ఈ సినిమాకు అత్యధిక సంఖ్యలో స్క్రీన్లను కేటాయించేందుకు పోటీ పడుతున్నారు.ఇటు టాలీవుడ్‌లో సూర్య హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో వచ్చిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'విశ్వనాథ్ అండ్ సన్స్', అలాగే రవితేజ నటించిన 'ఇరుముడి' చిత్రాలు పాజిటివ్ టాక్‌తో విజయవంతంగా ప్రదర్శించబడుతున్నాయి. ఇలాంటి తరుణంలో 'టాక్సిక్' లాంటి భారీ క్రేజ్ ఉన్న పాన్-ఇండియా చిత్రం ఎంట్రీ ఇస్తుండటంతో థియేటర్ల పోరు నైజాంతో పాటు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మళ్లీ మొదలైంది. ముఖ్యంగా నైజాం ప్రాంతంలో స్క్రీన్ల సర్దుబాటు నిర్మాతలు మరియు డిస్ట్రిబ్యూటర్లకు తలనొప్పిగా మారింది. భారీ రేట్లకు థియేటర్ల హక్కులను దక్కించుకున్న బడా సంస్థలు సింగిల్ స్క్రీన్లతో పాటు మల్టీప్లెక్స్‌లలోనూ సింహభాగం స్క్రీన్లను 'టాక్సిక్' కోసం లాక్ చేస్తున్నట్లు సమాచారం. దీనివల్ల బాక్సాఫీస్ వద్ద నిలదొక్కుకోవాలని చూస్తున్న స్థానిక తెలుగు చిత్రాలకు, చిన్న సినిమాలకు థియేటర్ల కొరత తీవ్రంగా ఏర్పడుతోంది. ప్రతిసారీ భారీ బడ్జెట్ పాన్-ఇండియా సినిమాలు విడుదలైనప్పుడల్లా టాలీవుడ్‌లో లోకల్ సినిమాలకు ఇలాంటి ఇబ్బందులు తలెత్తడం, థియేటర్ల కోసం పెద్ద యుద్ధమే జరగడం పరిపాటిగా మారింది. ఈసారి ఈ వివాదం ఏ స్థాయికి వెళు ్తుందోనని సినీ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365